అమ్మో.. ఏనుగులు



చిన్నరామాపురంలోకి చొరబడిన ఏనుగులు

వారం రోజులుగా పంట పొలాలపై పడి ధ్వంసం చేస్తున్న ఏనుగుల మంద.. ఆదివారం తెల్లవారుజామున ఊరిపైన పడ్డాయి. శనివారం రాత్రి చంద్రగిరి మండలం చిన్నరామాపురం వద్ద పంట పొలాలపై దాడులు చేశాయి. ఆదివారం తెల్లవారు జామున తొమ్మిది ఏనుగులు ఏకంగా చిన్నరామాపురంలోకే చొరబడ్డాయి. దీంతో గ్రామస్తులు ఉదయం వరకు ఇళ్లల్లోనే ఉండి.. బిక్కుబిక్కుమంటూ గడిపారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఏనుగుల జాడను కనిపెడుతూ వాటి వెంట సాగారు. ఉదయానికి నాగపట్ల అటవీ ప్రాంతంలోకి వెళ్లడంతో గ్రామస్తులు, అటవీశాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సీఐ సురేష్‌కుమార్, ఎస్‌ఐలు, సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి ఏనుగులు సంచరిస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరించారు. ఏనుగులు వస్తే అటవీశాఖకు, తమకు సమాచారమివ్వాలని కోరారు.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి

ఇలా గురి పెట్టాలి

ఇదిగో, ఈ గన్‌ను ఇలా తీసుకుని గురిపెట్టాలి.. అంటూ విద్యార్థులకు ఎస్పీ సుబ్బరాయుడు అవగాహన కల్పించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ఆదివారం తిరుపతిలోని పరేడ్ మైదానంలో పోలీసుల ఆయుధాలను ప్రదర్శించారు. వీటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వివిధ రకాల ఆయుధాలు, భద్రతా పరికరాలు, కమ్యూనికేషన్ సిస్టమ్, ఫోరెన్సిక్ సామగ్రి తదితరాలు ఎలా పనిచేస్తాయి? ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగిస్తామనేది విద్యార్థులు నేరుగా తెలుసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. తద్వారా వారిలో పోలీసు వ్యవస్థపై అవగాహన, విశ్వాసం పెంచడమే లక్ష్యమన్నారు. ఎస్‌ఎల్‌ఆర్, ఇన్‌సాస్, 9 ఎంఎం పిస్టల్ వంటి ఆయుధాలు, డ్రోన్ పరికరాలు, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, స్నిపర్ డాగ్ యానిట్లను ప్రదర్శించారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, శ్రీనివాసరావు, డీఎస్పీలు వెంకటనారాయణ, భక్తవత్సలం, చంద్రశేఖర్, ఆర్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



పోలీసు ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ



దైవాలదిబ్బ వద్ద..

'మొంథా' ఏం చేస్తుందో?

- బలహీనంగా స్వర్ణముఖి నది పొర్లుకట్టలు
- ఏమాత్రం వరద పెరిగినా నాలుగు గ్రామాలకు ఇబ్బందే

కోట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): భారీగా వర్షాలు పడి స్వర్ణముఖి నదీ మరింత ఉధృతమైతే ఆ నాలుగు గ్రామాలకు ఇబ్బందే. ఈ క్రమంలో తమను 'మొంథా' తుఫాను ఏం చేస్తుందోనని కోట మండలంలోని ఆ గ్రామాల వారు బిక్కుబిక్కుమంటున్నారు. కోట మండలం రుద్రవరం నుంచి గూడలి మీదుగా తిన్నెలపూడి వరకు ఆరు కిలోమీటర్లు.. పుచ్చలపల్లి నుంచి దొరువుకట్ట వరకు 16 కిలోమీటర్లు స్వర్ణముఖినది ఉంది. ఈ నదికి రెండువైపులా పొర్లుకట్టలు బలహీనంగా మారాయి. పదేళ్లుగా వీటికి శాశ్వత మరమ్మతులు చేయలేదు. దీంతో చాలాచోట్ల కట్టలు పగుళ్లిచ్చాయి.మట్టి జారిపోయాయి. దీంతో స్వర్ణముఖికి ఉధృత ప్రవాహం వస్తే ఎలాగంటూ సమీప ఐదు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మొంథా తుఫాను ప్రభావంవల్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురవనున్నాయి. ఈ క్రమంలో వాకాడు బ్యారేజీ నుంచి పుచ్చలపల్లి, అల్లంపాడు, దైవాలదిబ్బ, దొరువుకట్ట గ్రామాలమీదుగా వెళ్లే స్వర్ణముఖినదిలోకి 4,500క్యూసెక్కుల వరదనీటిని వదిలారు. ఇప్పటికే పుచ్చలపల్లి వద్ద స్వర్ణముఖి కరకట్టలు ధ్వంసమై ఉన్నాయి. ఇంకొంచెం ప్రవాహం పెరిగితే ప్రమాదమేనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంతో పాటు 1200 ఎకరాలకు ముప్పేనని అంటున్నారు. అల్లంపాడు, దొరువుకట్ట, దైవాలదిబ్బతో పాటు మజరా గ్రామాల్లో ఉన్న దళిత, గిరిజన కాలనీలు కూడా ఆయా స్వర్ణముఖి పొర్లుకట్టల కింద ఉన్నాయి. ఆయా కట్టలన్నీ గతేడాది వచ్చిన వర్షాలు, వరదలకు పూర్తిగా కోతకు గురై ఉన్నాయి. ఈ క్రమంలో స్థానికుల్లో 'మొంథా' ఏం చేస్తుందోనన్న భయాందోళన నెలకొంది. మరోవైపు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఈ పొర్లుకట్టలను పరిశీలించారు. ఏ క్షణంలో నైనా ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున సుమారు 4 గ్రామాల వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిన్నమొన్నటి వరకు ధైర్యంగా ఉంటూ వచ్చిన ఆయా గ్రామాల ప్రజలు ఎప్పుడు స్వర్ణముఖి నది కన్నెర్రచేస్తుందోనన్న ఆందోళనతో భయంభయంగా గడుపుతున్నారు.

సహాయక చర్యలకు అదనంగా రూ.కోటి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో తక్షణ సహాయక చర్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.19కోట్లు మంజూరు చేసింది. అందులో తిరుపతి జిల్లాకు రూ.కోటి కేటాయించింది. ఇప్పటికే రూ.2కోట్లు విడుదలచేసిన విషయం తెలిసిందే. తుఫాన్ ప్రభావంఎక్కువగా ఉన్న తిరుపతి, నెల్లూరు జిల్లాలకు రూ.కోటి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు రూ.50లక్షలు చొప్పున ప్రభుత్వం విడుదల చేసింది.

మూడు రోజులు బ్లాస్టింగ్ నిషేధం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని క్వారీ కౌలుదారులు మూడు రోజులపాటు క్వారీల్లో బ్లాస్టింగ్ చేయకూడదని జిల్లా మైన్స్ అధికారులు తెలిపారు. కార్మికులకు ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చూడాలన్నారు. మొంథా తుఫానుతో ఏదైనా నష్టం జరిగితే జిల్లా యంత్రాంగంతో కలసి మానవతా దృక్పధంతో సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.

అధికారులూ.. అప్రమత్తంగా ఉండండి

- కలెక్టర్ ఆదేశం.. నేడు పీజీఆర్ఎస్ రద్దు
- కంట్రోల్ రూమ్ నంబర్ 0877-2236007

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో రానున్న మూడు రోజులు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యల్లో పాల్గొనాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌ను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. తుఫాన్ కారణంగా సోమవారం మండలం, డివిజన్, కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్‌ను రద్దు చేసినట్లు ప్రకటించారు. ప్రమాదకర పరిస్థితులుంటే కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూమ్ 0877-2236007 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలకు సెలవు

తిరుపతి(విద్య), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సోమవారం నుంచి మూడు రోజులపాటు సెలవులు ప్రకటిస్తూ కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్, అంగన్వాడీ కేంద్రాలను మూడు రోజులపాటు మూసివేయాలని డీఈవో కేవీఎన్ కుమార్ విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. బడులకు సంబంధించి ఏ సమస్య ఉన్నా 85559 59755, 98857 92571 99666 35344 నెంబర్లలో కంట్రోల్ రూమ్‌కు సమాచారమివ్వాలన్నారు.

ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోండి: కలెక్టర్

వాకాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుఫాన్ నేపథ్యంలో ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఆదివారం ఆయన ఏర్పేడు, శ్రీకాళహస్తి, కోట, వాకాడు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. చెరువులు, నదులను పరిశీలించారు. అధికారులతో మాట్లాడారు. వాకాడు స్వర్ణముఖి బ్యారేజీ రోప్‌లను, బాలిరెడ్డిపాళెం వద్ద ముంపు ప్రాంతాన్ని చూసిన ఆయన.. స్వర్ణముఖి బ్యారేజీకి భారీ వరద వచ్చే అవకాశం ఉండడంతో గేట్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 27, 28, 29 తేదీల్లో 90నుంచి 100 కిలోమీటర్ల వేగంతో గాలులు, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, సముద్రతీర ప్రాంత మండలాల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సముద్రవేటకు వెళ్లిన మత్స్యకారులను ఇప్పటికే ఒడ్డుకు రప్పించామన్నారు. ముంపునకు గురయ్యే గ్రామాలను గుర్తించి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రత్యేక రక్షణ బృందాలను అందుబాటులో ఉంచామని వివరించారు. ఆక్రమణకు గురైన చెరువులు, ప్రభుత్వ భూములను గుర్తించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో గూడూరు ఇన్‌చార్జి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశి, ఇరిగేషన్ ఎస్ఈ రాధాకృష్ణమూర్తి, తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో సాయిప్రకాష్, ఇరిగేషన్ బ్యారేజీ ఏఈ శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ కిరణ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమాంజలి, ఎంఈవో నసీం ఆలీ, విద్యుత్‌శాఖ ఏఈ విజయలక్ష్మి, ఏవో దీప, టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదనరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాలిరెడ్డిపాళెం వద్ద పొర్లుకట్టలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

నేడు పోలీసు పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ రద్దు చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండడంతో రద్దు చేశామన్నారు.

తెలుగుగంగలో ఇద్దరి గల్లంతు

- కారు కడిగేందుకు కాలువలోకి వెళ్లిన ఇరిగేషన్ ఏఈ
- జారిపడిన మనవడిని కాపాడేందుకు దూకిన ఏఈ
- కొట్టుకుపోతున్న వీరిద్దరినీ కాపాడేందుకు వెళ్లిన డ్రైవరు
- ఏఈ బయటపడగా, కనిపించని ఇద్దరి ఆచూకీ



షరీఫ్, మహిత్ (ఫైల్ ఫొటోలు)

వరదయ్యపాళెం/బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ కాలువలో యువకుడు, ఆరేళ్ల బాలుడు గల్లంతయ్యారు. ఈ సంఘటన వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాల సరిహద్దులో జరిగింది. వరదయ్యపాళెం మండలానికి చెందిన ఇరిగేషన్ శాఖ ఏఈ బాబు తన కారు కడిగేందుకు కారు డ్రైవర్ షరీఫ్ అలియాస్ చిట్టి (40), మనవడు మహిత్(6)తో కలిసి ఆదివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఉబ్బలమడుగు సమీపంలోని తెలుగుగంగ కాలువ వద్దకు వెళ్లారు. కాలువలోని ర్యాంపులో కారు దించి కడుగుతుండగా బాలుడు మహిత్ కాలుజారి కాలువలోకి పడ్డాడు. బాలుడిని కాపాడేందుకు కాలువలోకి దూకిన బాలుడి తాత ఏఈ బాబు నీటి ప్రవాహానికి కొట్టుకు పోయారు. ఇది గమనించిన డ్రైవర్ షరీఫ్ వారిద్దరిని కాపాడేందుకు తానుకూడా కాలువలోకి దూకాడు. ఈ ఘటనలో డ్రైవర్ షరీఫ్, బాలుడు మహిత్ నీటి ప్రవాహంలో కొట్టుకు పోయారు. ఏఈ బాబు అదృష్టవశాత్తు చెట్టుకొమ్మను పట్టుకుని వేలాడుతుండగా అటుగా వెళుతున్న గిరిజన మత్స్యకారులు కాలువలోకి వల విసిరి బాబును రక్షించారు. కాగా గల్లంతైన షరీఫ్, మహిత్ కోసం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలిస్తున్నారు. బుచ్చినాయుడు కండ్రిగ ఎస్ఐ హరిప్రసాద్ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

'కలంకారీ' మునిరత్నమ్మ హఠాన్మరణం



శ్రీకాళహస్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కలంకారీలో జాతీయ అవార్డు గ్రహీతగా ఎంతో పేరు గాంచిన మునిరత్నమ్మ ఆదివారం హఠాన్మరణం చెందారు. శ్రీకాళహస్తికి చెందిన మునిరత్నమ్మ మూడు దశాబ్దాలకుపైగా కలంకారీలో ఎన్నో వైవిధ్య చిత్రాలను రూపొందించారు. రాష్ట్ర అవార్డుతో పాటు దేశవిదేశాల్లో ఎన్నో ప్రశంసలు పొందారు. 2008 కలంకారీలో తొలి మహిళా కలంకారీ జాతీయస్థాయి అవార్డును అందుకున్నారు. తుదిశ్వాస వరకు హస్తకళప్రావీణ్యంలో రాణించారు. ప్రపంచ నలుమూలలలోని పలు దేశాల్లో ఆమె చిత్రాలకు అభిమానులను సంపాదించుకున్నారు. ఆదివారం ఆమె హఠాన్మరణంతో హస్తకళల అభిమానులు, సాటి కళాకారులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పలువురు ఆమెకు సంతాపం వ్యక్తం చేశారు.

కొలువుదీరిన ముక్కంటి ధర్మకర్తలమండలి

- ఘనంగా ప్రమాణ స్వీకారం

శ్రీకాళహస్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తలమండలి ఆదివారం కొలువుదీరింది. ఎమ్మెల్యే సుధీర్, ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి ఆధ్వర్యంలో అంజిఅంజి వినాయకస్వామి సన్నిధిలో చైర్మన్ కొట్టే సాయిప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్లను మండలి సభ్యులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు శేషవస్త్రాలతో సత్కరించారు. పరిపాలన భవనంలోని మండలి చాంబర్‌కు చేరుకుని లాంచనంగా ఆశీనులయ్యారు. మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు తదితరులు అభినందనలు తెలిపారు. టీడీపీ నాయకులు మునిరాజానాయుడు, కంఠా రమేష్, గుర్రప్పశెట్టి, దుర్గాప్రసాద్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. పరిపాలన భవనంలో ధర్మకర్తల మండలికి మంత్రి నాదెండ్ల మనోహర్ అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే సుధీర్ సమన్వయంతో పొత్తు ధర్మంలో భాగంగా జనసేనకు ముక్కంటి ఆలయ చైర్మన్ స్థానం లభించిందని మంత్రి అన్నారు. కొన్ని చోట్ల స్థానిక ఎమ్మెల్యేలు గైర్హాజరైతే.. శ్రీకాళహస్తిలో మాత్రం ఎమ్మెల్యే పొత్తు ధర్మాన్ని పాటిస్తూ పాల్గొనడం సంతోషకరమన్నారు. ఆయనతో పాటు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, జనసేన నేత కిరణ్ రాయల్ పాల్గొన్నారు.

భక్తులకు తీవ్ర ఇక్కట్లు

ఆదివారం రద్దీ ఎక్కువ. అదే సమయంలో అధిక సంఖ్యలో భక్తులు బారులుతీరే రూ.500 రాహుకేతు మండపం ఎదురుగా ఉన్న అంజి అంజి వినాయక స్వామి సన్నిధిలో కార్యక్రమం జరిగింది. మండలి సభ్యులకు చెందినవారు, ప్రముఖులు, స్థానిక నేతలు ఒకేసారి అక్కడికి రావడంతో సుమారు 3 గంటల పాటు క్యూలైన్లు స్తంభించిపోయాయి. ఇక, మంత్రి నాదెండ్ల మనోహర్ వాహనం నాలుగో గేటు వద్ద చిక్కుకుపోవడంతో ఆయన పరిపాలన భవనం చేరుకోవడానికి రద్దీలో ఇబ్బంది పడ్డారు. గంటలతరబడి క్యూలైన్లలో భక్తులు, వృద్ధులు, చంటిబిడ్డలతో అవస్థలు పడ్డారు. ఆగమ నియమానికి విరుద్ధంగా మూలమూర్తులకు సమర్పించే నైవేద్యం ఆలస్యమైందంటూ భక్తులు సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

సమన్వయం పాటించని చైర్మన్

జనసేన నేత కొట్టే సాయిప్రసాద్‌ను చైర్మన్‌గా, మరో 15మంది సభ్యులుగా, మరొకరిని ప్రత్యేక ఆహ్వానితులుగా వివిధ నియోజకవర్గాల నుంచి తొలిసారి నియమించారు. సహచర సభ్యులతో సమన్వయం పాటించడంలో సాయి విఫలమయ్యారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ, టీడీపీ సభ్యులు రెండు రోజుల క్రితం వేర్వేరుగా ప్రమాణ స్వీకారం చేయడం గమనార్హం. ఆదివారం కూడా సీనియర్లతో సమన్వయం లేకుండా ర్యాలీలు, ఫ్లెక్సీలు వేశారన్న విమర్శలున్నాయి.



చైర్మన్ కొట్టే సాయిని అభినందిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

◆ వస్తాడని ఎదురుచూస్తే

కన్నీళ్లే మిగిలాయ్..!

- కర్నూలు బస్సు ప్రమాదమృతుల్లో గుడుపల్లెవాసి

అమ్మా.. నేను ఊరికి బయలుదేరా.

- కూతురికి వాట్సప్ కాల్ చేసి చెప్పాడు.

శుక్రవారం ఉదయం 7.30 గంటలకల్లా బంగారుపేట వచ్చేస్తా. కారు తీసుకొని వచ్చేయ్.

- కుప్పంలోని ట్రావెల్స్ డ్రైవర్ నాగరాజుకు ఫోన్ చేసి చెప్పారు.

కానీ, ఆయన రాలేదు. ఎక్కడున్నాడో తెలుసుకుందామంటే ఫోను స్విచ్ఛాఫ్. ఒకవైపు ఏమయ్యారోనని కుటుంబీకుల్లో ఆదుర్దా. మరోవైపు.. పనుల నిమిత్తం తరచూ బయట వెళ్తుండటంతో.. వస్తారులే అనే నమ్మకం. ఇంతలో హైదరాబాదు నుంచి వస్తూ కర్నూలు వద్ద ట్రావెల్స్ బస్సు కాలిపోయిందన్న వార్తతో.. ఆ బస్సులో ఏమైనా ఎక్కారా అన్న ఆందోళన ఇంకోవైపు. వస్తారులే అంటూ శుక్ర, శనివారాల్లో ఎదురు చూసిన వారికి కన్నీళ్లే మిగిలాయి. కర్నూలు బస్సు ప్రమాదంలో 19వ మృతదేహం గుడుపల్లె మండలం యామగానిపల్లెకు చెందిన త్రిమూర్తి(58)గా ఆదివారం నిర్ధారించడంతో కుటుంబం విషాదంలో మునిగిపోయింది.



త్రిమూర్తి
(ఫైల్ ఫొటో)

త్రిమూర్తి క్వారీ వ్యాపారం చేస్తున్నారు. పెద్ద భార్య వసంతమ్మతో కలిసి ఉంటున్నారు. త్రిమూర్తి, వసంతమ్మ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు కళ్యాణ్ భరత్ హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, కుమార్తె చైతన్య పెళ్లయి చెన్నైలో నివసిస్తున్నారు. హైదరాబాదులో బంధువుల పెళ్లికని ఈనెల 22వ తేదీ ఉదయం కుప్పం నుంచి బెంగళూరుకు రైలులో.. అక్కడ్నుంచి ట్రావెల్స్ బస్సులో వెళ్లారు. హైదరాబాదులో 23వ తేదీ వివాహానికి హాజరయ్యారు. అదే రోజు రాత్రి ట్రావెల్స్ తిరుగు ప్రయాణమయ్యారు. తాను కుప్పం బయలుదేరుతున్నట్లు చెన్నైలోని కుమార్తె చైతన్యకు వాట్సప్ కాల్ చేసి చెప్పారు. తనకు ఎప్పుడూ కారు తీసుకువచ్చే కుప్పానికి చెందిన ట్రావెల్స్ డ్రైవర్ నాగరాజుకు ఫోన్ చేసి.. శుక్రవారం (24వ తేది) ఉదయం 7.30కంతా కర్నాటక రాష్ట్రం బంగారుపేటకు చేరుకుంటానని చెప్పారు. ఆ సమయానికి కారు తీసుకురమ్మన్నారు. ఆ ప్రకారం బంగారుపేట వెళ్లిన నాగరాజు ఎంత సేపు వేచిఉన్నా త్రిమూర్తి రాకపోవడం.. ఎటువంటి సమాచారం లేకపోవడంతో ఫోను చేశారు. త్రిమూర్తి వద్దనున్న నెంబర్లకు కాల్ చేసినా స్విచ్ ఆఫ్ అనే వచ్చింది. ఆ తర్వాత ఆయన వెనక్కి వచ్చేశారు. హైదరాబాదు నుంచి బెంగళూరు బయలుదేరిన ట్రావెల్స్ బస్సు కర్నూలు ప్రమాదంలో దగ్ధమైందన్న వార్తలు మీడియాలో రావడంతో త్రిమూర్తి కుటుంబ సభ్యులు కొంత ఆందోళనకు గురయ్యారు. ఇక, 19 మంది మృతుల వివరాలు ఆరా తీసే క్రమంలో కర్నూలు పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ సేకరించారు. తద్వారా 19వ మృతదేహం త్రిమూర్తిది అయిఉంటుందని ప్రాథమికంగా గుర్తించారు. డీఎన్‌ఏ పరీక్ష నిమిత్తం హైదరాబాదులోని అతడి కుమారుడు కళ్యాణ్ భరత్‌కు సమాచారం ఇచ్చి కర్నూలు పిలిపించారు.ఆదివారం జరిపిన డీఎన్‌ఏ పరీక్షల్లో చనిపోయింది త్రిమూర్తిగా నిర్ధారించినట్లు తెలిసింది. కర్నూలు నుంచి మృతదేహాన్ని సోమవారానికి యామగానిపల్లెకు తీసుకొచ్చే అవకాశం ఉందని త్రిమూర్తి కుటుంబీకులు తెలిపారు.

- కుప్పం, ఆంధ్రజ్యోతి

గొట్టిగంటి చెరువు సప్లై ఛానెల్ పునరుద్ధరణ


పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

భాకరాపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రెడ్డి చెరువు నుంచి చిన్నగొట్టిగల్లు చెరువుకు ఉన్న సప్లై ఛానెల్ పునరుద్ధరణ పనులను టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్ ఆదివారం ప్రారంభించారు. 2005లో ఎర్రావారిపాళెం మండలం రెడ్డిచెరువు నుంచి చిన్నగొట్టిగల్లు చెరువుకు 14 కిలోమీటర్ల మేర సప్లై ఛానెల్ నిర్మించారు. కాలువ నిర్మించిన ఏడాదికి చెరువుకు కొద్దిపాటి నీరు వచ్చింది. ఆ తరువాత అక్కడక్కడా గండ్లు పడడంతో 2016లో టీడీపీ ప్రభుత్వ హయాంలో గండ్లను పూడ్చి రెడ్డి చెరువు మొరవ నీరు గొట్టిగంటి చెరువుకు చేరేలా చేశారు. 2021లో తుపానుకు చెరువుకు సప్లై ఛానెల్ ద్వారా రెండు రోజులు మాత్రమే నీరు వచ్చింది. గండ్లు పడి నీరు ఆగిపోయింది. తరువాత దానిని ఎవరూ పట్టించుకోలేదు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి స్థానిక నాయకులు ఈ విషయం తీసుకెళ్లారు. ఆయన స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి కాలువ గండ్లను పూడ్చి నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులు ఆదేశించారు. ఆదివారం సప్లై ఛానెల్‌కు పూజలు చేసి పనులు ప్రారంభించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చెస్ విజేతలకు బహుమతుల అందజేత


విజేతలతో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

పాకాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం మండల స్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పాకాల, సత్యం చారిటబుల్ ట్రస్ట్, సహచర సమాంతర ఆలోచనల సామాజిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను ఎంఈవో బాబ్జీ, విజయబాబు పోటీలను ప్రారంభించారు. అండర్ సెవెన్‌లో శశాంక్ చౌదరి, అండర్ నైన్‌లో చికిత్ రాయల్, అండర్ 11లో జి.ఇషాన్‌రాయల్, అండర్ 13లో శాశిబేబి, అండర్ 15లో ఎన్.హరినాథ్‌లు గోల్డ్ మెడల్స్ సాధించారు. అండర్ 7లో చరణ్‌తేజ్ రెడ్డి, అండర్ 9లో రుత్విక్ రెడ్డి, అండర్ 11లో మోహిత్ రాజ్, అండర్ 13లో సుజన్, విజయచరణ్, అండర్ 15లో హర్షవర్ధన్, జి.ధీరజ్‌లు సిల్వర్ మెడల్స్ సాధించారు. పి.పవాజ్, సాత్విక్, సాయి తన్మయిలు బ్రాంజ్ మెడల్ సాధించారు. జేతలకు మెడల్స్, ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ రఫీ, లయన్స్ క్లబ్ ఆఫ్ పాకాల అధ్యక్షుడు పి.అనిల్, కార్యదర్శి మహేష్ బాబు, ట్రెజరర్ నాగేంద్ర, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ ధనుంజయ, సహచర మండల అధ్యక్షుడు జశ్వంత్ పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజానికి సైకిల్ యాత్ర


చంద్రగిరి కోట వద్ద రోటరీ క్లబ్ సైకిల్ యాత్రికులు

చంద్రగిరి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా పోలియో రహిత ప్రపంచం కోసం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు నుంచి తిరుపతికి సైకిల్ యాత్ర చేపట్టారు. ఈసైకిల్ యాత్ర ఆదివారం చంద్రగిరి కోట చేరుకుంది. వీరు పోలియో నిర్మూలన గురించి స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రోటరీ క్లబ్ బెంగళూరు గవర్నర్ బీఆర్ శ్రీధర్ మాట్లాడుతూ భారత్ ఇప్పటికే 12 ఏళ్లుగా పోలియో రహిత దేశంగా నిలిచిందన్నారు. ప్రపంచమంతా పోలియో రహిత సమాజంగా మారడం తమ లక్ష్యమన్నారు. రోటరీ క్లబ్ తిరుపతి జిల్లా సెక్రటరీ మాగం హేమచంద్ర, ప్రెసిడెంట్ రాజేంద్రశెట్టి, మాజీ అధ్యక్షుడు సోము, రవికుమార్, సంకల్ప హాస్పిటల్ ప్రతినిధి సోమేశ్వర్ బండ్ల, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణముఖి ఉధృతి పరిశీలన


స్వర్ణముఖినదిని పరిశీలిస్తున్న దివాకర్‌రెడ్డి

తిరుపతి రూరల్, అక్టోబరు26(ఆంధ్ర జ్యోతి): దుర్గసముద్రం పంచాయతీ పరిధిలోని స్వర్ణముఖినదిని ఆదివారం తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి పరిశీలించారు. నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న 24గంటలలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున్న తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ..దుర్గసముద్రం నుంచి చిగురువాడ దక్షిణపు కండ్రిగవరకు చెక్‌డ్యామ్‌ని ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఆయన పరిశీలించి తగిన చర్యలు చేపడుతామన్నారు. టీడీపీ ఉమ్మడిజిల్లా ప్రధానకార్యదర్శి మునిశేఖర్‌రాయల్, కూటమిపార్టీనేతలు పాల్గొన్నారు.

వర్షాలకు సగం చెరువులు ఫుల్


మొరవపోతున్న సిద్దల గండి ప్రాజెక్టు

ఎర్రావారిపాలెం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని 135 చెరువులు నిండాయని నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో పెద్ద నీటి నిల్వ జలాశయం సిద్దల గండి పూర్తి స్థాయిలో నిండి మొరవ పోతోందని ఏఈ తెలిపారు. మండలంలో 245 చెరువులు ఉన్నాయన్నారు. రెండు మూడు రోజుల్లో అన్ని చెరువులు నిండుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. చెరువుల్లో నీరు చేరడంతో భూగర్భ జలాల మట్టం పెరగనుందన్నారు. చెరువుల కట్టల పరిస్థితిపై సమాచారం అందించాలన్నారు.

చేనేత, హస్తకళల మేళా ప్రారంభం


చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న డాక్టర్ రామ్మోహన్

తిరుచానూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక పద్మశాలి కల్యాణ మండపంలో ఆదివారం చేనేత, హస్తకళల మినీ మేళా ప్రారంభమైంది. పద్మశాలి సంఘం నగర అధ్యక్షుడు డాక్టర్ రామ్మోహన్ దీనిని ప్రారంభించారు. సంస్కృతి కల్చరల్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో మేళా ప్రారంభించినట్లు మహేష్ తెలిపారు. పదిరోజుల పాటు జరిగే మేళాలో పలు రాష్ట్రాల కళాకారుల ఉత్పత్తులు అమ్మకం కోసం అందుబాటులో ఉంచుతున్నారు. జైపూర్ బెడ్‌షీట్స్, సహరంగపూర్ గృహాలంకరణ వస్తువులు, కలంకారీ చీరలు, మీరట్ చెప్పులు, కొండపల్లి బొమ్మలు, కడప చేనేత టవల్స్, షోలాపూర్ చెప్పులు ఆకర్షణగా నిలుస్తున్నాయి. కార్యక్రమంలో పద్మశాలి సంఘం కార్యదర్శి వెంకటశేషయ్యకోశాధికారి హేమాద్రి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో చోరీ

● బంగారు ఆభరణాలు, వెండి అపహరణ


చోరీ జరిగిన గదిని పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రసాద్, క్లూస్ టీం

తిరుచానూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఓ విశ్రాంత ఉద్యోగి ఇంట్లో దొంగలు బంగారు, వెండి అభరణాలు దోచుకుపోయారు. సీఐ సునీల్‌కుమార్ కథనం మేరకు వివరాలు ఇలా.. ప్రభుత్వ లెక్చరర్‌గా రిటైరైన వెంకటా చలపతి కుటుంబం తిరుచానూరు టెలిఫోన్ కాలనీలో నివసిస్తోంది. దీపావళి సందర్భంగా వీరంతా హైదరాబాద్‌కు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దుండగులు, ఇంటి ప్రధాన తలుపు గడియ విరగ్గొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాలోని సుమారు వంద గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు కేజీల వెండి వస్తువులు, కొంతనగదు దోచుకెళ్లారు. ఆదివారం ఉదయం వారి ఇంటికి వచ్చిన పనిమనిషి తలుపులు తెరచి ఉండటం గమనించింది. వెంటనే చుట్టుపక్కల వారికి చెప్పింది. వారు తిరుచానూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ ప్రసాద్, సీఐ సునీల్‌కుమార్, ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి చోరీ ప్రాంతాన్ని పరిశీలించారు. నిందితుల వేలిముద్రలను క్లూస్ టీం సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. దొంగతనానికి పాల్పడిన వారి చిత్రాలు సమీపంలోని ఓ సీసీ కెమెరాలో రికార్డు అయినట్లు తెలుస్తోంది. ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన అంత్యక్రియలు

తిరుపతి రూరల్, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): వేదాంతపురం స్వర్ణముఖినది వంకలో మృతిచెందిన నలుగురు బాలుర అంత్యక్రియలు ఆదివారం పూర్తయ్యాయి. శనివారం లభించిన ప్రకాశ్, మునిచంద్ర మృతదేహాలకు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. బాలుర తల్లిదండ్రులను గ్రామస్తులు పరామర్శించి ఓదార్చారు

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పాకాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుపాను నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సంతోషసాయి కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎక్కడైనా చెట్లు, విద్యుత్ తీగలు ఇళ్లపై పడి నష్టం వాటిల్లితే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలన్నారు. తమ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. 9492712100 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు. వాగులు, వంకలు, చెరువులు మొరవల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు.

మల్లిమడుగు డ్యాం వద్ద సందడి



రేణిగుంట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మల్లిమ డుగు డ్యాం వద్ద ఆదివారం సందర్శకుల సందడి నెల కొంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు డ్యాం నిండటంతో గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఆదివారం సెలవుదినం కావడంతో కోడూరు, రాజంపేట, తిరుపతి, రేణిగుంట పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో డ్యాం పరిసరాలు నిండిపోయాయి. యువత, మహిళలు కుటుంబసభ్యులతో సహపంక్తి భోజనాలు చేశారు. చేపలు పడుతూ కేరింతలతో సందడి చేశారు.

వృద్ధురాలి నగలు, నగదు అపహరణ

నాగలాపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కూతురు ఇంటికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఆర్టీసీ బస్సులో నగలు, నగదు ను ఓ వృద్ధు రాలు పోగొట్టుకుంది. బాధితురాలి వివరాల మేరకు... నాగలాపురం మండలం వెళ్లూరు గ్రా మానికి చెందిన నీలమ్మ(62) శనివారం ఉద యం తమిళనాడులోని తిరువళ్లూరులో నివాసం ఉంటున్న తన కూతురు ఇంటికి వెళ్లింది. తిరిగి ఆదివారం ఉదయం తిరువళ్లూరు నుంచి బస్సులో నాగలాపురానికి బయలుదేరింది. తిరుగు ప్రయాణంలో ఊత్తుకోట నుంచి నాగలాపురానికి ఆర్టీసీ బస్సు ఎక్కి ఉచిత ప్రయాణం కోసం తన ఆధార్‌కార్డును పర్సు నుంచి కండక్టర్‌కి చూపించింది. కారణి వరకు బస్సులో కూర్చోడానికి వీలు లేకుండా నిలబడి ప్రయాణించింది. నాగలాపురం బస్టాండ్‌లో దిగిన తరువాత తన బ్యాగులో ఉన్న పర్సు కనబడడం లేదని గుర్తించింది. బస్సులో వెతికినా కనిపించలేదు. పర్సులో 3 సవర్ల బంగారం, రూ.5 వేలు నగదు ఉందని, పర్సు కనపడడం లేదని కంగారుతో వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామని నాగలాపురం పోలీసులు తెలిపారు.

మామిడి రైతుల ఖాతాల్లో రూ.3.70 కోట్ల జమ

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులకు ప్రక టించిన సబ్సిడీ నగదును వారి ఖాతాల్లో జమ చేసింది. కిలో మామిడికి రూ.4 చొప్పున ఇచ్చిన మాట ప్రకారం పుత్తూరు, వడమాలపేట మం డల పరిధిలోని రైతులకు రూ.3.70 కోట్ల నగదు జమ అయ్యింది. మామిడిని పల్ప్ ఫ్యాక్టరీకి తరలించే సమయంలో అక్కడ ఉద్యానవన శాఖ సిబ్బందికి అందించిన బ్యాంకు ఖాతా లలోనే పడుతుందని చాలా మంది రైతులు భావిస్తున్నారు. ఇలా సమస్యాత్మకంగా ఉన్న 37 మంది రైతుల సమస్య పరిష్కరించారు. అంతే కాకుండా 23 మంది రైతులకు సంబంధించి ఆధార్ లింక్ కలిగిన బ్యాంక్ వివరాలు ఇవ్వక పోవడం సమస్యగా మారింది. వీరి సమస్య కూడా పరిష్కరించారు. సబ్సిడీ నగదు తమ ఖాతాల్లో జమ కావడంతో రైతుల్లో సంతోషం వెల్లివిరిసింది. కాయలు తోలిన ప్రతి ఒక్కరికి నగదు జమ అవుతుందని ఉద్యానవనశాఖ అధి కారి సౌజన్య పేర్కొన్నారు. ఇంకా ఏదైన సమస్య కారణంగా నగదు జమ కానీ రైతులు ఈ నెల 30వ తేదీలోగా పుత్తూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని కార్యాలయంలో అందజేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నేతకు గాయాలు

పెళ్లకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ పాలక మండలి ప్రత్యేక ఆహ్వానితురాలుగా నియమితులైన చాగణం శైలజ ప్రమాణ స్వీకారానికి వెళ్లి వస్తూ ఓజిలి టీడీపీ నేత వల్లూరు సూర్యప్రకాష్ రావు కుటుంబ సభ్యులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. సూర్యప్రకాశ్‌రావు కుమార్తె చాగణం శైలజ శ్రీకాళహస్తిలో ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. దీనికి సూర్యప్రకాశ్‌రావు ఆయన కుమారుడు మురళీధర్‌రావు, కోడలు మల్లిక, సమీప బంధువైన మరో యువతి కారులో వెళ్లారు. తిరిగి వస్తుండగా పెన్నేపల్లి వద్ద ముందువెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా తిరిగింది. ఆ కారును సూర్యప్రకాష్‌రావు కుటుంబ సభ్యులు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సూర్యప్రకాష్‌రావు, ఆయన కోడలు మల్లిక గాయపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూలకముందే పట్టించుకోండి సారూ..!

● ప్రమాదకరంగా వకుళమాత ఆర్చి



డ్రైనేజీ వ్యర్థాలు, కాలువ మధ్య నీటి పైప్‌లైన్-అసంపూర్తిగా కాలువ నిర్మాణ పనులు


ఆర్చి పిల్లర్ కింద ఏర్పడిన గొయ్యి

తిరుపతిరూరల్, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): పేరూరుబండపై వెలసిన వకుళమాత ఆలయమార్గంలోని ప్రధాన ఆర్చి పిల్లరు కింద భాగం సిమెంటు, మట్టి వర్షాలకు కొట్టుకుపోయింది. అక్కడ గొయ్యి ఏర్పడింది. గొయ్యి పక్కనే పొల్లాలోకి పాకడంతో భవిష్యత్‌లో ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్చి సమీపంలోని రహదారి కొంతదూరం కుంగిపోయి నిలువెత్తు గొయ్యి ఏర్పడింది. ఈగుంత రోజురోజుకూ పెరుగుతూ ప్రమాదాల నిలయంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. ఆలయానికి సంబంధించిన డ్రైనేజీవ్యర్థాలను సమీపంలోని పాత కాల్వకి చెందిన పంచాయతీ ఖాళీస్థలంలో వదిలేస్తుండడంతో అస్తవ్యస్తంగా తయారైంది. ఈమురుగు ముందుకు పారేందుకు సరైన అవుట్‌లెట్‌లేదు. ఖాళీస్థలంలో నిల్వగా చేరుతోంది. మురుగు కాలువలోనే గ్రామానికి నీరు సరఫరా చేసే పీవీసీ పైప్‌లైన్ వెళుతోందని, లీకేజీ ఏర్పడితే మురుగునీరు కలిసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. . కల్యాణ మండపం వెనుకభాగం వైపు నుంచి వచ్చే వర్షపునీరు బయటకు వెళ్లేందుకు ఉద్దేశించిన కాలువ నిర్మాణ పనులను అసంపూర్తిగా చేపట్టారు. కాలువ ఎత్తుగా ఉంది. బయటకు వెళ్లే అవకాశం లేక నీరు అక్కడే నిలిచిపోతోంది.

13 ప్రైవేట్ బస్సులపై కేసుల నమోదు

తిరుపతి(రవాణా), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రవాణా, పోలీసుశాఖల అధికారులు ఆదివారం ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. వివిధ నగరాల నుంచి చేరుకున్న 13 బస్సుల్లో ఫైర్ డైరెక్షన్, అలారం సిస్టమ్, ఫైర్ డైరెక్టర్ అండ్ సప్రెషన్ సిస్టం లేని కారణంగా కేసులు నమోదు చేశారు. వీటిని మంగళం ఆర్టీసీ డిపోకు తరలించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ రవిమనోహరాచారి, జిల్లా రవాణాశాఖ అధికారి మురళీమోహన్‌లు శనివారం రాత్రి 27 వాహనాలపై కేసులు నమోదు చేశామన్నారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు. అవసరమైన పత్రాలు, భద్రతకు సంబంధించి సదుపాయాలు లేకున్నా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 2019 ఏప్రిల్ తరువాత రిజిస్ట్రేషన్ చేసుకున్న బస్సులకు ఫైర్ డైరెక్టర్ అండ్ అలారం సిస్టం తప్పకుండా ఉండాలన్నారు. 2003 నుంచి రిజిస్ట్రేషన్ చేసిన వాటిలో ఫైర్ డైరెక్షన్ అండ్ సప్రెషన్ సిస్టం ఉండాలని సూచించారు. తనిఖీల్లో ఈస్ట్ డీఎస్పీ భక్తవత్సలం, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, మోహన్‌కుమార్, ఆంజనేయ ప్రసాద్, ఆంజనేయ వర్మ, సీఐలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి పోరు

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఫలాలు అందించేందుకు పోరాడాలని భవననిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రమణ పిలుపు నిచ్చారు. బైరాగిపట్టెడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పథకాలు అందనీయకుండా అన్యాయం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కూడా భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. నాయకులు కె.రవి, శ్రీరాములు, చంద్రశేఖర్ రెడ్డి, రవి,పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు


ఈశ్వర్ ప్రకాష్‌ను సన్మానిస్తున్న కోటి ఆర్ట్స్ నిర్వాహకులు, కళాకారులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : మహతి కళాక్షేత్రంలో ఆదివారం కోటి ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలతో పలువురు చిన్నారులు ఆహుతులను ఆట్టుకున్నారు. ప్రతిభ చూపిన కళాకారులకు నాట్య మయూరి అవార్డులను జోస్ ప్రాపర్టీస్ అధినేత ఈశ్వర్ ప్రకాష్ ప్రదానం చేశారు. ఈశ్వర్ ప్రకాష్‌ను కోటీ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు కల్లుపల్లి సురేందర్‌రెడ్డి, నిర్వాహకులు కోటి, అబి, శాస్త్రి, హరిత తదితరులు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని పుణ్యక్షేత్రాల సందర్శనార్థం ప్రత్యేక బస్సుల ఏర్పాటు చేసినట్లు అలిపిరి డిపో మేనేజర్ హరిబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఉదయం 7గంటలకు తిరుపతి బస్ స్టేషన్ నుంచి బయల్దేరి గుడిమల్లం, అప్పలాయగుంట, వకుళమాత ఆలయం, ముక్కోటి, తలకోన, కపిలతీర్థం మీదుగా తిరిగి సాయంత్రం 7గంటలకు బస్టాండుకు చేరుకుంటుందన్నారు. ఒకరికి టిక్కెట్ రూ.360. పిల్లలకు రూ. 190. ప్రతి సోమవారం ఉదయం 6గంటలకు తిరుపతి బస్ స్టేషన్ నుంచి వేలూరు, తిరువణ్ణామలై ఓ బస్సు కేటాయించామన్నారు. రానూపోనూపెద్దలకు రూ. 600, పిల్లలకు రూ. 300. అద్దెకు కూడా బస్సులు పంపుతామన్నారు. వివరాల కోసం 7382882450 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

టీడీపీ ఎన్‌ఆర్‌ఐలకు సీఎం కితాబు


సీఎం చంద్రబాబుతో సారథినాయుడు, రాధాకృష్ణ

చంద్రగిరి, అక్టోబరు 26(ఆంధ్ర జ్యోతి): సౌదీ అరేబియా సోషల్ మీడియా కోఆర్డినేటర్ వడ్లమూడి సారథి నాయుడి(పనపాకం పంచాయతీ రవణప్పగారిపల్లె)ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రశంసించారు. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం దుబాయి వెళ్లిన సీఎంను టీడీపీకి చెందిన ప్రవాస భారతీయులు కలిశారు. గల్ఫ్‌లో టీడీపీ ఎన్‌ఆర్‌ఐలు గతేడాది ఎన్నికలలో కూటమి విజయానికి విశేష కృషి చేశారని చంద్రబాబు కొనియాడారు. గల్ఫ్ టీడీపీ అధ్యక్షుడు రావి రాధాకృష్ణ, వడ్లమూడి సారథినాయుడులు సౌదీ నుంచి ఏపీలోని ఐదువేల మందిని ప్రభావితం చేశారన్నారు. వారిని అభినందించారు. బాబు అభినందించడం సంతోషంగా ఉందని వారు ఆంధ్రజ్యోతికి ఫోన్‌లో తెలిపారు.

టీడీపీలోకి డక్కిలి ఎంపీపీ!


గంగాప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గోను రాజశేఖర్, పక్కన ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

డక్కిలి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): డక్కిలి ఎంపీపీ గోను రాజశేఖర్ టీడీపీ గూటికి చేరేందుకు సమాయత్తం అయినట్లు సమాచారం. ఆదివారం వెంకటగిరికి వచ్చిన ప్రముఖ పారిశ్రామికవేత్త గంగాప్రసాద్, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌లను కలిసి భవిష్యత్ రాజకీయాలపై చర్చించినట్లు తెలిసింది. ప్రస్తుతం కాశీ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తిరిగి వచ్చాక టీడీపీలో చేర్చుకుంటామని గంగాప్రసాద్ హామీ ఇచ్చినట్లు సమాచారం. కాగా, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కు డక్కిలి ఎంపీపీ గోను రాజశేఖర్ సమీప బంధువు కావడంతో టీడీపీలో చేరికకు గ్రీన్ సిగ్నల్ లభించిందనట్లేనని సమాచారం.

నెరబైలు కార్యదర్శి డీపీవోకు సరెండర్

ఎర్రావారిపాలెం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నెరబైలు గ్రామ పంచాయతీ కార్యదర్శి అలెబ్బను జిల్లా పంచాయతీ రాజ్ శాఖ కార్యాలయానికి సరెండర్ చేస్తు ఎంపీడీవో మదన్‌మోహన్‌రాజు ఆదేశాలు జారీ చేశారు. ఈయన ప్రవర్తన తీరు సరిగాలేదని, నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని జీపీఆర్ఎస్‌లో ఫిర్యాదులు అందాయి. దీనిపై విచారణ జరపాలని జిల్లా అధికారులు ఆదేశించారు. శుక్రవారం ఎమ్మెల్యే పులివర్తి నాని తలకోన పర్యటన సమయంలో కూడా కూడా నిర్లక్షంగా వ్యవహరించారు. ఈక్రమంలో అలెబ్బను జిల్లా పంచాయతీ కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఎంపీడీవో తాజాగా ఆదేశాలు జారీ చేశారు.

చెరువు కట్టలను పటిష్ఠ పరచండి: కలెక్టర్


జంగాలపల్లి చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

ఏర్పేడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): చెరువు కట్టలను పటిష్ఠ పరచాలని నీటి పారుదల శాఖ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఏర్పేడు మండలంలోని జంగాలపల్లి, పల్లం చెరువులను ఆదివారం ఆయన ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా జంగాలపల్లి చెరువును పరిశీలించిన సమయంలో గతంలో జంగాలపల్లి చెరవుకు బొగడ పడి రివిట్‌మెంట్ నిర్మాణం జరిగిందని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. వెంటనే చెరువుకు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని పేర్కొన్నారు. అనంతరం అక్కడి నుంచి వెంకటగిరికి వెళ్లే మార్గంలో జాతీయ రహదారికి అనుకుని ఉన్న పల్లం చెరువును పరిశీలించారు. ఇప్పటికే 75శాతం చెరువు నిండిందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ, ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ రాధాకృష్ణ, ఈఈ శివారెడ్డి, డీఈ ఆదినారాయణ నాయుడు, జేఈ జయకుమార్, తహసీల్దారు భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు, టీడీపీ నాయకులు ఎన్.పొన్నారావు, బాలాజీ రావు, గురువులు, చంద్రశేఖర్‌నాయుడు, రాజకుమార్‌నాయుడు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్‌నాయుడు తదితరులున్నారు.

తిరుమలలో దివ్య ఔషధవనం ఏర్పాటు

రేపటి టీటీడీ బోర్డు సమావేశంలో నిర్ణయం

తిరుమల, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): తిరుమలలో దివ్య ఔషధ వనాన్ని ఏర్పాటు చేసేందుకు టీటీడీ సిద్ధమవుతోంది. పర్యవరణానికి ఇబ్బంది కలిగించే మొక్కలతో పాటు కూలడానికి సిద్ధంగా ఉన్న మొక్కలను తొలగించి వాటి స్థానంలో మేలు జాతి మొక్కలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానేజీఎన్సీ టోల్‌గేట్‌కు సమీపంలో దివ్య ఔషధవనం ఏర్పాటు చేసే అంశంపై అధికారులు ఇప్పటికే పలు సమావేశాలు నిర్వహించారు. 140కిపైగానే ఔషధ మొక్కలను ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు రూపొందించుకున్నారు. శ్రీవారి ప్రతిమ, వివిధ రకాల పుష్పమొక్కలను ఏర్పాటు చేయనున్నారు. మంగళవారం జరిగే ధర్మకర్తల మండలిలో చర్చించి తీర్మానం చేయనున్నారు.

వైకుంఠ ద్వార దర్శనాలపై ప్రధాన చర్చ

శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలపై ఈబోర్డులో చర్చ జరుగనుంది. గతంలో ఏకాదశి, ద్వాదశి రోజుల్లో మాత్రమే వైకుంఠ ద్వార దర్శనాలు చేయించేవారు. గత ప్రభుత్వంలో శ్రీరంగం ఆలయం తరహాలో పదిరోజుల పాటు వైకుంఠద్వారాలు తెరిచి భక్తులకు దర్శనాలు చేయించే విధానాన్ని ప్రవేశపెట్టారు. గత వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సమయంలో చోటుచేసుకున్న తొక్కిసలాటల నేపథ్యంలో తిరిగి పాత విధానాన్నే అమలుచేయాలనే టీటీడీ భావిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే ఆగమ సలహామండలితో పాటు ప్రభుత్వం కూడా ఇందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. పదిరోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాలు చేయించాలా, లేకా పూర్వపద్ధతిలోనే రెండురోజులు మాత్రమే చేయించాలా అనే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. వీటితో పాటు క్యూలైన్ల నిర్వహణ, రద్దీ క్రమబద్ధీకరణ, త్వరతగితన దర్శనం చేయించే వివిధ అంశాలపై టీసీఎస్ సంస్థ ఇప్పటికే పరిశీలన చేసి సమర్పించిన నివేదికపై కూడా చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఒంటిమిట్టలో వంద గదులతో వసతి సముదాయం నిర్మాణం, టీటీడీ ఆస్పత్రులన్నిటికీ ఒకే డైరెక్టర్‌ను నియమించి, ఆయా ఆస్పత్రులకు కమిటీలు ఏర్పాటు చేసే అంశంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి ప్రత్యేక అధికారుల బృందం ఏర్పాటు, తిరుమలలోని వీఐపీ గదుల అద్దె ధరల్లో ఉన్న వ్యత్యాసాలను సవరించి ఒక క్రమపద్ధతిలోకి తీసుకురావడం వంటి అంశాలపై చర్చించనున్నారు. మరోవైపు ఇప్పటికే టీటీడీకి విరాళాలు ఇచ్చిన దాతల సంఖ్య 80 వేలకుపైగానే ఉంది. వీరికి కల్పించిన ప్రివిలేజెస్‌లో చేపట్టాల్సిన మార్పులు, చేర్పులపై కూడా తీర్మానాలు చేయనున్నారు. శ్రీవాణి టికెట్ల జారీలో చేయాల్సిన మార్పులపై కూడా చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం. వీటితో పాటు టికెట్లు, టోకెన్లు లేకుండా నేరుగా తిరుపతికి చేరుకునే వయోవృద్ధులు, దివ్యాంగులకు దర్శన టికెట్లు కేటాయించే అంశంపై కూడా నిర్ణయం తీసుకోనున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: **రూ.3.58 కోట్లు**

శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: **82,010**

తలనీలాలు సమర్పించినవారు: **29,634**

భావి తరాల చైతన్యానికే 5కే రన్



జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రవి మనోహరాచారి

తిరుచానూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్, లోన్ యాప్స్, జంక్ ఫుడ్స్, మొబైల్ అడిక్షన్ వంటి వాటిని నిర్మూలించి భావి తరాలను చైతన్య పరచడమే లక్ష్యంగా స్లేట్ స్మార్ట్ 5కే రన్ ఉద్దేశమని స్లేట్ ది స్కూల్ వ్యవస్థాపకులు వాసిరెడ్డి అమర్‌నాథ్ అన్నారు. స్థానిక వెంకట్రామపురంలోని పాఠశాల ఆధ్వర్యంలో స్లేట్ స్మార్ట్‌స్టార్ట్ కార్యక్రమం పేరిట ఆదివారం 5కే రన్ నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ రవి మనోహరచారిజెండా దీనిని ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజానికి బెట్టింగ్, లోన్ యాప్స్, జంక్ ఫుడ్, మొబైల్ అడిక్షన్, రోట్ లెర్నింగ్ వంటివి సమాజ స్థితిగతులను మార్చి జీవితాలను అస్తవ్యస్తం చేస్తున్నాయన్నారు. బెట్టింగ్‌కు సంబంధించి అమర్‌నాథ్ రూపొందించిన ప్రత్యేక వీడియో పాటను ఎస్వీ యూనివర్శిటీ వీసీ నర్సింగ్‌రావు ప్రారంభించారు. మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రజనీ, డీఎస్పీ శ్రీలత, విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి, విశ్రాంత ప్రొఫెసర్ కిరణ్‌కాంత్ చౌదరి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

ఫిబ్రవరిలో దక్షిణ భారత బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక



బ్రోచర్లను విడుదల చేస్తున్న నాయకులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేదం హరిప్రసాద్ కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతీయం(ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు) బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక వచ్చే ఏడాది ఫిబ్రవరి 22న తిరుపతిలోని కరకంబాడిరోడ్డులోని ఉద్దండ గణపతి వేద పాఠశాలలో జరుగుతుందన్నారు. జిల్లా నియోజక వర్గాల ప్రతినిధుల సమక్షంలో ఈ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9949339851, 9441661212 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు. సమావేశంలో నరసింహాచార్య, సంధ్యారాణి, హరిణి, మురళీశర్మ పాల్గొన్నారు.

వేదమంత్ర సారమే సంకీర్తనల తత్వం



కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : వేదమంత్ర సారాన్ని సంకీర్తనలుగా మలచి వాగ్గేయకారులు మనకందించారని పరిహార సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి.చక్రపాణి తెలిపారు. విశ్వామిత్ర సర్వీస్ సొసైటీ, ఆర్ట్ ఆఫ్ హ్యూమానిటీ సంయుక్తంగా ఆదివారం కేటీరోడ్డులోని ఎన్జీవో కాలనీలోని అరవింద సొసైటీ కార్యాలయంలో నామ సంకీర్తన వైభవం పేరుతో నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. కళాకారులు రామస్వామి, రఘుపతి, నిర్మల, హేమలత, హరిచందన.లు పలు సంకీర్తనలను గానం చేసి శ్రోతల్లో భక్తి భావాన్ని నింపారు. అనంతరం కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో రంగస్థల నటుడు బొందు రామచంద్రారెడ్డి, మల్లం విజయకుమార్‌రెడ్డి, కోవూరు సుధ, డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, నాయని మధు, శరవణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ



ఆరుష్‌రెడ్డి ఇతర విద్యార్థులతో నిదియా మున్నీ

తిరుపతి(విద్య), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో అబాకస్ పోటీల్లో తమ విద్యార్థి తిరుపతికి చెందిన ఎస్. ఆరుష్‌రెడ్డి ప్రథమ బహుమతిని గెలుచుకున్నారని వారియర్స్ అబాకస్ సంస్థ డైరెక్టర్ నదియా మున్ని తెలిపారు. క్యూబాటెక్ ఎడ్యుటెక్ ప్రవేట్ లిమిటెడ్ సంస్థ శనివారం బెంగుళూరులో అబాకస్ జాతీయస్థాయి పోటీ నిర్వహించగా... 5 నిమిషాల్లో 200 సమస్యలను పరిష్కరించి రికార్డు సృష్టించారని ఆమె తెలిపారు. ఆరుష్‌రెడ్డితోపాటు వారియర్స్ విద్యార్థులు ప్రజ్ఞారెడ్డి విజేతగా నిలిచారంటూ వారికి అభినందనలు తెలిజేశారు.

గడపగడపకూ బీసీ నినాదం



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):గడప గడపకూ బీసీ నినాదం తీసుకెళ్లాలని ఓబీసీ విద్యార్థి సంఘం నాయకులు నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ దశాబ్దాల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలపై సవతిప్రేమ చూపుతున్నాయన్నారు. అత్యధిక జనాభా కలిగిన బీసీ సామాజిక వర్గానికి చట్టసభల్లో తగిన ప్రాధాన్యత కల్పించేలా రిజర్వేషన్ల కోసం చాన్నాళ్లుగా పోరాటాలు చేస్తున్నామన్నారు. ఐదు శాతం ఉన్న అగ్రవర్ణ పేదలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ఆరురోజుల్లో అమలు జరిగిందన్నారు. గడప గడపకు బీసీ నాదం అనే కరపత్రిక ద్వారా ఓబీసీప్రజలను చైతన్య పరుస్తామని వివరించారు.

31న శ్రీవారి మెట్లోత్సవం

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : తిరుపతి అలిపిరి పాదాల మండపం వద్ద దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈనెల 31న శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఆదివారం తెలిపింది. మెట్లపూజ నిర్వహించి భజన మండలి సభ్యులతో తిరుమలకు బయలుదేరుతారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందు రోజున తిరుమలలోని ఆస్థాన మండపంలో నామ సంకీర్తన, సామూహిక భజన, ధార్మిక సందేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌కు రజత పతకం



రజత పతకం అందుకుంటున్న ఆనంద్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్ క్యాడెట్ ఆనంద్ రజత పతకాన్ని పొందారు. బెంగళూరులో నిర్వహించిన ప్రీమియర్ ఈక్వెస్ట్రియన్ లీగ్-25 డ్రస్సేజ్ పోటీలో గెలుపొందారు. గుర్రపు స్వారీలో నైపుణ్యాన్ని ప్రదర్శించినందుకు ఈ పతకం అందుకున్నారు. ఆనంద్‌ను పలువురు ఎన్‌సీసీ అధికారులు అభినందించారు. మిగతా ఎన్‌సీసీ క్యాడెట్లకు ఈ గెలుపు ప్రేరణ ఇస్తుందని వారు పేర్కొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



రాజేశ్వరి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ కెమిస్ట్రీ పరిశోధకురాలు ఎం. రాజేశ్వరి డాక్టరేట్ పొందారు. సింథసిస్ అండ్ బయోస్సే స్టడీస్ ఆఫ్ సమ్ నావెల్ హెటిరోసైకిల్స్ అంశంపై రిటైర్డు ప్రొఫెసర్ సి. వెంకట్రావు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

కొర్లగుంటలో కార్డన్ సెర్చ్



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి కొర్లగుంటలో ఆదివారం ఉదయం 5 గంటల నుంచి దాదాపు మూడు గంటల పాటు పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అక్కడ నేరాలకు అడ్డాగా మారడం...మందుబాబులు అగడాలు పెరిగిపోవడం, అకతాయిలు విజృంభిస్తుండడంతో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడి ఆదేశాల మేరకు డీఎస్పీ భక్తవత్సలం నేతృత్వంలో సీఐలు శ్రీనివాసులు, రామయ్య, మురళీమోహన్‌చ ఎస్ఐలు కొర్లగుంటలో ఇంటింటికీ వెళ్ళి తనిఖీలు చేశారు. అనుమానితులను బయటకు రప్పించి విచారించారు.ద్విచక్ర వాహనాలు, జీపులు, ఇతర వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు లేని వాహనాలు సీజ్ చేశారు. అనుమానితులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఆ చైన్ స్నాచర్లు ఢిల్లీ ముఠాయేనా...

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఈస్ట్ పరిధిలో ఒకే రోజు నలుగురు మహిళల మెడల నుంచి బంగారు చైన్లు లాక్కెళ్లిన దొంగల కోసం పోలీసులు ఢిల్లీకి పయనమవుతున్నారు. పాత కొర్లగుంట రోడ్డు, శివజ్యోతినగర్, మధురానగర్, తిలక్ రోడ్డు, బైరాగిపట్టెడ ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి ద్విచక్రవాహనం దొంగలించి ఆ వాహనం ద్వారా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లు సీసీ ఫుటేజీల ఆధారంగా గుర్తించారు. వారి కోసం ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశారు. దొంగలు ఢిల్లీ బ్యాచ్‌గా పోలీసులు గుర్తించారు. ఇద్దరు ప్రధాన నిందితులు కాగా వీరి వెనుక మరో నలుగురు సూత్రధారులున్నట్లు భావిస్తున్నారు. ఢిల్లీ పోలీసుల సహకారంతో దొంగలను పట్టుకునేందుకు రెండు, మూడు రోజుల్లో పోలీసు బృందాలు అక్కడకు వెళ్లనున్నాయి.

కలిసికట్టుగా పార్టీ అభివృద్ధికి కృషి

- జనసేన నేతలతో మంత్రి నాదెండ్ల



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్

తిరుపతి అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అంతర్గత విభేదాలను పక్కనపెట్టి కలసి కట్టుగా పనిచేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ పార్టీ నాయకులను సూచించారు. ఆదివారం ఆయన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇంట్లో ఎమ్మెల్యే, ఉమ్మడి చిత్తూరుజిల్లా జనసేన అధ్యక్షుడు డాక్టర్.పి.హరిప్రసాద్, నగర అధ్యక్షుడు రాజారెడ్డిలతో వివిధ అంశాలపై చర్చించారు. గ్రూపురాజకీయాలు చేస్తే ఎవరిపైనైనా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించినట్లు సమాచారం. ఎమ్మెల్యేకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. త్వరలో చేపట్టనున్న పార్టీ సభ్యత్వ నమోదులో ఉమ్మడి చిత్తూరుజిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నారు. పార్టీ సానుభూతిపరులు, పవన్‌కల్యాణ్ అభిమానులను కార్యకర్తలుగా మలుచుకోవడంలో దృష్టి సారించాలన్నారు. కొత్తవారు అసంతృప్తి చెందకుండా సీనియర్స్ కలుపుకొని పోవాలన్నారు. కొత్త మున్సిపల్ భవనం త్వరగా పూర్తిచేసేలా, ఇంటర్ మోడల్ బస్సుస్టేషన్ నిర్మాణం, అండర్‌డ్రైనేజీ విస్తరణ, రెయిన్ వాటర్ స్టోరేజీ కల్వర్టుల ఏర్పాటుపై దృష్టిసారించాలన్నారు. అనంతరం పార్టీ నాయకులు, జనసేన కార్పొరేటర్లను, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణను ఎమ్మెల్యే మంత్రికి పరిచయం చేశారు.

పీపీపీ పేరుతో ప్రైవేటీకరణ వద్దు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

తిరుపతి(విద్య), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీడాక్టర్ గేయానంద్ రచించిన "పీపీపీ పేరుతో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వద్దు" పుస్తకాన్ని జనవిజ్ఞాన వేదిక నాయకులు ఆవిష్కరించారు. ఆదివారం తిరుపతిలోని యూటీఎఫ్ కార్యాలయంలో జన విజ్ఞానవేదిక జిల్లా కార్యదర్శి సుంకర రెడ్డప్ప ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మెడికల్ కళాశాలలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తే కళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రుల్లో వైద్యం కూడా వ్యాపారమైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై జనవిజ్ఞానవేదిక రాష్ట్రవ్యాప్తంగా రౌండ్‌టేబుల్ సమావేశాలు, కరపత్రాల పంపిణీ, సమావేశాలు విస్తృతంగా నిర్వహిస్తోందన్నారు. జన విజ్ఞాన వేదిక నాయకులు బిర్లా నాయుడు, రవీ, యూటీఎఫ్ నాయకులు ముత్యాల రెడ్డి, మధు, రామ చంద్రా రెడ్డి, నాగరాజు, జెవివి కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన పీఆర్సీ కోసం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కె.నాగప్రసాద్

తిరుపతి(ఆటోనగర్),అక్టోబరు26(ఆంధ్రజ్యోతి) ఇంజనీర్ల సమస్యలను ఐక్య మత్యంతో పోరాడి సాధించుకుందామని ఏపీఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.శామ్యూల్, కె.నాగప్రసాద్, కె.వి.రామారావు, డి.నాగరాజులు పేర్కొన్నారు. కచ్చపి ఆడిటోరియంలో ఆదివారం అసోసియేషన్ రాష్ట్రకమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పీఆర్సీలో పెండింగ్ సమస్యలను దశలవారీగా పరిష్కరించుకున్నామన్నారు. రానున్న పీఆర్సీ మరింత మెరుగ్గా సాధించుకోవడానికి సంఘం కృషి చేస్తుందన్నారు. ఏఈల ఖాళీల భర్తీపై యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నామని చెప్పారు. నాగప్రసాద్‌తోపాటు సదరన్ డిస్కం నాయకులు పుల్లా బాలాజీ, వి.రమేష్, పి.రవి కుమార్‌లు ప్రసంగించారు. అనంతరం రాష్ట్ర నాయకులను డిస్కం నాయకులు సత్కరించారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు క్రిష్ణప్రసాద్, లక్ష్మణ్‌రావు, నాయకులు కె.జయప్రకాష్, మునిప్రసాద్, ఆంజనేయులు, రమేష్, సతీష్ వెంకటలక్ష్మి, స్వాతిలతోపాటు సభ్యులు పాల్గొన్నారు.

గ్రేటర్‌పై వైసీపీ దుష్ప్రచారం

- నరసింహయాదవ్, ఆర్‌సీ మునికృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహయాదవ్, ఆర్‌సీ మునికృష్ణ తదితరులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిని అభివృద్ధి పథంలో నడిపింది కూటమి ప్రభుత్వమేనని యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణలే అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో నరసింహయాదవ్ మాట్లాడుతూ ఇటీవల కౌన్సిల్ సమావేశంలో గ్రేటర్ తిరుపతికి అడ్డు చెబుతున్నట్లు వైసీపీ కార్పొరేటర్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు వ్యతిరేకించడం సరికాదన్నారు. గ్రేటర్ స్థాయి నగరంగా అభివృద్ధి చేయాలనుకుంటున్నామన్నారు. నలుగురు ఎమ్మెల్యేలతో చర్చించి గ్రేట్ తిరుపతికి సలహాలు తీసుకుంటున్నామని తెలిపారు. మాస్టర్‌ప్లాన్ రోడ్లు తాము చేపడితే వైసీపీ టీడీఆర్ బాండ్ల కుంభకోణంతె సంపాదించుకుందని ఎద్దేవా చేశారు. ఆర్‌సీ మునికృష్ణ మాట్లాడుతూ తిరుపతిలో అభివృద్ధి టీడీపీ పుణ్యమేనన్నారు.. గత వైసీపీ హయాంలో నగరం ఏమాత్రం అభివృద్ధి చెందలేదన్నారు. గ్రేటర్ తిరుపతి కూటమితోనే సాధ్యమని స్పష్టం చేశారు.

గంగమ్మ ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న ఆరణి, చిత్రంలో మహేష్‌యాదవ్

తిరుపతి అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయాన్ని మరింత విస్తరించి అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే నివాసంలో గంగమ్మ ఆలయ ట్రస్టుబోర్డు తొలి సమావేశం జరిగింది. ఆలయ అభివృద్ధికి చేపట్టవలసిన పనులు, పెండింగ్ బిల్లులు, ఉద్యోగుల సమస్యలపై ప్రధానంగా చర్చించారు. నెలకు రూ. 3లక్షలు ఆదాయం సమకూరుతుండగా సిబ్బంది జీతాలకు రూ. 11లక్షలు అవుతున్నట్లు, వర్షపునీరు ఆలయంలోపలకి వస్తోందని, దీంతో భక్తులకు ఇబ్బంది కలుగుతోందని ఈవో జయకుమార్ సమావేశం దృష్టికి తెచ్చారు. సమస్యల పరిష్కారంపై బోర్డు చర్చించింది. అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని, క్రమేణ పెరుగుతున్న భక్తుల దృష్ట్యా ఆలయం ఆనుకొని ఉన్న ప్రైవేటు స్థలాలను కొనుగోలు చేయడంపై ఎమ్మెల్యే బోర్డు చైర్మన్ మహేష్ యాదవ్, సభ్యులను అభినందించారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి హోమం





పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు , హోమ పూజల్లో పాల్గొన్న అధికారులు, భక్తులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కపిలేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం సుబ్రహ్మణ్యస్వామి హోమం వైభవంగా జరిగింది. ఆంజనేయ స్వామి సన్నిధికి సమీపంలో వేదికపై శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలశ స్థాపన చేసి గణపతి పూజ, పుణ్యాహవచనం నిర్వహించి హోమ పూజలు చేశారు. మూడు రోజులపాటు జరిగిన ఈ పూజల్లో ఆఖరి రోజున మహా పూర్ణాహుతి సమర్పించారు. అంతకు ముందు ఆలయంలోని యాగశాలలో కలశ ఉద్వాసన చేసి సుబ్రహ్మణ్యస్వామి మూలవిరాట్లకు మహాభిషేకాలు నిర్వహించి హారతులు సమర్పించారు. కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సీహెచ్.వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, సినీ హీరో సుధీర్ బాబు, నటి సురేఖవాణి, ఆమె కుమార్తె, నటి సుప్రిత, నటుడు, దర్శకుడు బలగం వేణు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

-త్వరలోకొత్త సినిమా ప్రకటన

దర్శనం అనంతరం దర్శకుడు వేణు ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, తన తర్వాత సినిమా గురించి రెండుమూడు వారాల్లో ప్రకటన ఉంటుందన్నారు. దిల్‌రాజు ప్రొడక్షన్ నుంచి అధికారికంగా తెలియజేస్తామన్నారు. వచ్చే ఏడాది ప్రారంభంలో సినిమా షూటింగ్ మొదలవుతుందన్నారు.



దర్శకుడు వేణు, నాదెండ్ల మనోహర్, సురేఖ వాణి, సుప్రిత

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం: కలెక్టర్



దైవాలదిబ్బ వద్ద స్వర్ణముఖి పొర్లుకట్టలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

కోట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సముద్రతీరప్రాంత గ్రామాల ప్రజలు అధైర్యపడొద్దని, అండగా ఉంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కోట మండలం దొరువుకట్ట, దైవాదిబ్బ గ్రామాల్లో బలహీనంగా ఉన్న స్వర్ణముఖి పొర్లుకట్టలను ఆదివారం కలెక్టర్ రైతులతో కలిసి పరిశీలించారు. ఆయా గ్రామాల్లో స్వర్ణముఖినది కట్టలన్నీ పూర్తిగా బలహీనపడి ఉన్నాయని, నదిలో వరదనీరు ఎక్కువైతే కట్టలు తెగిపోయి గ్రామాలన్నీ నీట మునిగే ప్రమాదం ఉందని ఆయకట్టు రైతులు చిల్లకూరు దశరధరామిరెడ్డి, దువ్వూరు గోవర్ధన్‌రెడ్డి, దువ్వూరు రమణారెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ముంపునకు గురయ్యే గ్రామాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి సదుపాయాలు కల్పించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. జనవరి 5లోగా స్వర్ణముఖినది పొర్లుకట్టలకు మరమ్మతులు చేపడుతామన్నారు. కలెక్టర్ వెంట గూడూరు ఇన్‌చార్జి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జునరావు, ఇరిగేషన్ ఏఈ మునిరత్నం, పలుశాఖల అధికారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నేతకు గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పెళ్లకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ పాలక మండలి ప్రత్యేక ఆహ్వానితురాలుగా నియమితులైన చాగణం శైలజ ప్రమాణ స్వీకారానికి వెళ్లి వస్తూ ఓజిలి టీడీపీ నేత వల్లూరు సూర్యప్రకాష్ రావు కుటుంబ సభ్యులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. సూర్యప్రకాశ్‌రావు కుమార్తె చాగణం శైలజ శ్రీకాళహస్తి ఆలయంలో ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి సూర్యప్రకాశ్‌రావు ఆయన కుమారుడు మురళీధర్‌రావు, కోడలు మల్లిక, వారి సమీప బంధువైన మరో యువతి కారులో వెళ్లారు. తిరిగి వస్తుండగా పెళ్లకూరు మండలంలోని పెన్నేపల్లి వద్ద 71వ జాతీయ రహదారిపై ముందువెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా తిరిగింది. ఆ కారును సూర్యప్రకాష్‌రావు కుటుంబ సభ్యులు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సూర్యప్రకాష్‌రావు, ఆయన కోడలు మల్లిక గాయపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ హయాంలోనే కల్తీ మద్యం తయారీ: నెలవల



నవ గ్రహాల మండపానికి భూమి పూజ చేస్తున్న నెలవల

పెళ్లకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలోనే కల్తీ మద్యం తయారీ ప్రారంభమయిందని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు ఆదివారం ఆయన తాళ్వాయిపాడు గ్రామంలోని శివాలయంలో నూతనంగా నిర్మించనున్న నవగ్రహాలు మండపానికి భూమిపూజ చేశారు. అనంతరం ఇటీవల గాయపడిన గ్రామానికి చెందిన ఏఎంసీ ఉపాధ్యక్షుడు కిలారి గోపిని పరామర్శించారు. ఈ సందర్భంగా నెలవల మీడియాతో మాట్లాడుతూ కల్తీ మద్యంపై మాజీ సీఎం జగన్ మాటలకు ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పారిశ్రామికవేతలను తరిమికొట్టిన జగన్ గూగుల్ డేటా సెంటరును తానే తెచ్చినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 18 నెలల్లోనే విశాఖకు గూగుల్ డేటా సెంటర్‌ను తీసుకొచ్చిన ఘనత సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైసీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు పసల గంగాప్రసాద్, మదన్‌మోహన్ నాయుడు, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, కన్నడి శ్రీనివాసులు, కానూరు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

గూడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం అధికంగా ఉండనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించడంతో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాల తరలించడంతో పాటు నష్టం వాటిల్లకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి హోమం



పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కపిలేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం సుబ్రహ్మణ్యస్వామి హోమం వైభవంగా జరిగింది. ఆంజనేయ స్వామి సన్నిదికి సమీపంలో వేదికపై శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలశ స్థాపన చేసి గణపతి పూజ, పుణ్యాహవచనం నిర్వహించి హోమ పూజలు చేశారు. మూడు రోజులపాటు జరిగిన ఈ పూజల్లో ఆఖరి రోజున మహాపూర్ణాహుతి సమర్పించారు. అంతకు ముందు ఆలయంలోని యాగశాలలో కలశ ఉద్వాసన చేసి సుబ్రహ్మణ్యస్వామి మూలవిరాట్లకు మహాభిషేకాలు నిర్వహించి హారతులు సమర్పించారు. కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సీహెచ్.వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో నాగరత్న, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

31న శ్రీవారి మెట్లోత్సవం

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి అలిపిరి పాదాల మండపం వద్ద దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈనెల 31న శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఆదివారం తెలిపింది. మెట్ల పూజ నిర్వహించి భజన మండలి సభ్యులతో తిరుమలకు బయలుదేరుతారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందు రోజున తిరుమలలోని ఆస్థాన మండపంలో నామ సంకీర్తన, సామూహిక భజన, ధార్మిక సందేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

టీడీపీలోకి డక్కిలి ఎంపీపీ!

డక్కిలి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): డక్కిలి ఎంపీపీ గోను రాజశేఖర్ టీడీపీ గూటికి చేరేందుకు సమాయత్తం అయినట్లు సమాచారం. ఆదివారం వెంకటగిరికి వచ్చిన ప్రముఖ పారిశ్రామికవేత్త గంగాప్రసాద్, గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌లను కలిసి భవిష్యత్ రాజకీయాలపై చర్చించినట్లు తెలిసింది. ప్రస్తుతం కాశీ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తిరిగి వచ్చాక టీడీపీలో చేర్చుకుంటామని గంగాప్రసాద్ హామీ ఇచ్చినట్లు సమాచారం. కాగా, గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌కు డక్కిలి ఎంపీపీ గోను రాజశేఖర్ సమీప బంధువు కావడంతో టీడీపీలో చేరికకు గ్రీన్ సిగ్నల్ లభించిందనట్లేనని సమాచారం.



గంగాప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గోను రాజశేఖర్, పక్కన ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్



గూడూరు మండలంలోని వేములపాళెం, చిల్లకూరు మండలం తిప్పగుంటపాళెం చప్టాలపై ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్‌ఫొటోలు)

హైలెవెల్ వంతెనల నిర్మాణం కలేనా?

వరదలొస్తే జలదిగ్బంధంలో గ్రామాలు

గూడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో లోలెవెల్ చప్టాలపై వరదనీరు ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోతున్నాయి. ఏళ్ల తరబడి ఇదే తంతు కొనసాగుతున్నా ఇప్పటి వరకు హైలెవెల్ వంతెనల నిర్మాణానికి నోచుకోకపోవడంతో ప్రజలు అవస్థలు పడాల్సివస్తోంది. తుపాన్ల ప్రభావంతో భారీ వర్షాలు కురిస్తే చప్టాలపై వరదనీరు 6 అడుగుల మేర ప్రవహిస్తుండడంతో జలదిగ్బంధంలో చిక్కుకున్న గ్రామాలకు సహాయక సిబ్బంది పడవల్లో వెళ్లి ఆహారం అందించాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. అంతేకాకుండా జలదిగ్బంధంలో చిక్కుకున్న సమయంలో గ్రామాల్లో ఎవరైనా తీవ్ర అస్వస్థతకు లోనైతే వారిని చికిత్స నిమిత్తం తరలించేందుకు ఆపసోపాలు పడాల్సివస్తోంది.

గూడూరు మండలం వేములపాళెం సమీపంలోని చప్టాపై వరదనీరు ప్రవహిస్తే విందూరు, రామలింగాపురం, చెంబడిపాళెం, సంతదాసుపల్లి, ఈదలపల్లి, మిటాత్మకూరు తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. చిల్లకూరు మండలం తిప్పగుంటపాళెం సమీపంలోని చప్టాపైకి వరదనీరు చేరుకుంటే ఆ గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుపోతుంది. పడవల సాయంతో గ్రామస్తులకు ఆహార పదార్థాలు అందించాల్సిందే. వాకాడు మండలం గంగన్నపాళెం వద్ద చప్టాపై నీరు చేరితే పామంజి, వాల్మేడు, జమీన్ కొత్తపాళెం తదితర 15పైగా గ్రామాలకు, పంబలి సమీపంలోని చప్టాపై నీరు ప్రవహిస్తే కాకివాకం, శ్రీనివాసపురం తదితర ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి తీరప్రాంతాల ప్రజలు అవస్థలు పడాల్సివస్తోంది. కోట మండలంలో గోవిందపల్లిపాళెం, పుచ్చపల్లికి వెళ్లే మార్గాల్లోని చప్టాల పరిస్థితి కూడా ఇలాగే ఉండడంతో ఐదుకు పైగా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడాల్సివస్తోంది. చిట్టమూరు మండలం కొత్తగుంట మార్గంలోని చప్టాలపై రొయ్యల కాలువ పొంగి ప్రవహిస్తుండడంతో మల్లాం, నాయుడుపేట మార్గాల్లో రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో మల్లాం, పల్లపర్తి, కొక్కుపాడు తదితర ఐదు గ్రామాలకు పైగా రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఇకనైనా అధికారులు స్పందించి వరదల సమయంలో చప్టాలపై ఇబ్బందులు కలుగకుండా హైలెవెల్ వంతెనలను నిర్మించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో నాణ్యమైన మద్యం: నెలవల



సురక్ష యాప్‌పై అవగాహన కార్యక్రమంలో నెలవల, ఎక్సైజ్ అధికారులు, టీడీపీ నేతలు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో పారదర్శకంగా, నాణ్యమైన మద్యం విక్రయించడం జరుగుతోందని మాజీ ఎంపీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని పార్కు సమీపంలో ఉన్న ఓ మద్యం దుకాణం వద్ద ఆదివారం ఎక్సైజ్ సీఐలు అరుణకుమారి, బాలకృష్ణ ఆధ్వర్యంలో సురక్షయాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఆటవిక పాలన కొనసాగిందన్నారు. జే బ్రాండ్‌లను తీసుకొచ్చి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడారని విమర్శించారు. ఎక్సైజ్ సీఐ అరుణకుమారి మాట్లాడుతూ దుకాణంలో మద్యం విక్రయించే సమయంలో బాటిల్‌ను సురక్షయాప్‌లో స్కాన్ తీసి ఇచ్చే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ గంగాధర్, టీడీపీ నాయకులు రఫీ, పల్లమాల రామిరెడ్డి, అరవపెరిమిడి చంద్రారెడ్డి, పసల గంగాప్రసాద్, నానాబాల సుబ్బారావు, నారాయణ, రవి, సంచి కృష్ణయ్య, ముత్యాలయ్య, నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, చెంగయ్య, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యం పాపం వైసీపీదే



కార్యక్రమంలో కూటమి నేతలు, ఎక్సైజ్ అధికారులు

వెంకటగిరి టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో నకిలీ, కల్తీ మద్యం విక్రయించి ప్రజల ప్రాణాలను హరించిన వైసీపీ నేతలు ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై బురద జల్లడానికి ప్రయత్నిస్తున్నారని ఏఎంసీ ఛైర్మన్ ఘనుగోటి విశ్వనాథం అన్నారు. ఆదివారం స్థానిక క్రాస్ రోడ్డు వద్ద ఎక్సైజ్ సురక్షయాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎంసీ ఛైర్మన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మద్యం అమ్మకాల విషయంలో పారదర్శకంగా ఉందన్నారు. ప్రతి మద్యం బాటిల్‌ను సురక్ష యాప్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కా చేసి అమ్మకాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ పులికల్లు రాజేశ్వరావు, కేవీకే ప్రసాద్, అవ్వారు సత్యనారాయణ, శ్రీనివాసులు, చంద్రమౌళిరెడ్డి, కోటీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అడవయ్యకాలనీలో కార్డెన్ సెర్చ్

గూడూరు అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పరిధిలోని అడవయ్య కాలనీ ప్రాంతంలో ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని 11 మోటారు బైక్‌లను, 3 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ నేరాలను నియంత్రించేందుకు కార్డన్ సెర్చ్ చేపట్టామన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తుల సంచారం ఉన్నా, గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తున్నా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ పట్టణ కార్యదర్శి కాలేషా మృతి



కాలేషా (ఫైల్‌ఫొటో)

గూడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ పట్టణ కార్యదర్శి కాలేషా అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, నాయకులు హరినాధ్‌రెడ్డి, రామా నాయుడు, మురళి, ప్రభాకర్, నాయకులు సీవీఆర్ కుమార్, నారాయణ, మెంకటేశ్వర్లు, జమాలుల్లా తదితరులు సంతాపం తెలిపారు.

జనసేన బలోపేతానికి కలిసికట్టుగా కృషి

పార్టీ నేతలతో మంత్రి నాదెండ్ల



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్

తిరుపతి అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అంతర్గత విభేదాలను పక్కనపెట్టి కలసి కట్టుగా పనిచేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ పార్టీ నాయకులను సూచించారు. ఆదివారం ఆయన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇంట్లో ఎమ్మెల్యే, ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షుడు డాక్టర్.పి.హరిప్రసాద్, నగర అధ్యక్షుడు రాజారెడ్డిలతో వివిధ అంశాలపై చర్చించారు. గ్రూపు రాజకీయాలు చేస్తే ఎవరిపైనైనా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించినట్లు సమాచారం. ఎమ్మెల్యేకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. త్వరలో చేపట్టనున్న పార్టీ సభ్యత్వ నమోదులో ఉమ్మడి చిత్తూరు జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నారు. పార్టీ సానుభూతిపరులు, పవన్‌కల్యాణ్ అభిమానులను కార్యకర్తలుగా మలుచుకోవడంలో దృష్టి సారించాలన్నారు. కొత్తవారు అసంతృప్తి చెందకుండా సీనియర్స్ కలుపుకొని పోవాలన్నారు. అనంతరం పార్టీ నాయకులు, జనసేన కార్పొరేటర్లను, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణను ఎమ్మెల్యే మంత్రికి పరిచయం చేశారు.

ఆ చైన్ స్నాచర్లు ఢిల్లీ ముఠాయేనా...

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఈస్ట్ పరిధిలో ఒకే రోజు నలుగురు మహిళల మెడల నుంచి బంగారు చైన్లు లాక్కెళ్లిన దొంగల కోసం పోలీసులు ఢిల్లీకి పయనమవుతున్నారు. పాత కొర్లగుంట రోడ్డు, శివజ్యోతినగర్, మధురానగర్, తిలక్ రోడ్డు, బైరాగిపట్టెడ ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి ద్విచక్రవాహనం దొంగలించి ఆ వాహనం ద్వారా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లు సీసీ ఫుటేజీల ఆధారంగా గుర్తించారు. వారి కోసం ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశారు. దొంగలు ఢిల్లీ బ్యాచ్‌గా పోలీసులు గుర్తించారు. ఇద్దరు ప్రధాన నిందితులు కాగా వీరి వెనుక మరో నలుగురు సూత్రధారులున్నట్లు భావిస్తున్నారు. ఢిల్లీ పోలీసుల సహకారంతో దొంగలను పట్టుకునేందుకు రెండు, మూడురోజుల్లో పోలీసు బృందాలు అక్కడకు వెళ్లనున్నాయి.

అలరించిన నృత్యప్రదర్శనలు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మహతి కళాక్షేత్రంలో ఆదివారం కోటి ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలతో పలువురు చిన్నారులు ఆహూతులను ఆట్టుకున్నారు. ప్రతిభ చూపిన కళాకారులకు నాట్య మయూరి అవార్డులను జోస్ ప్రాపర్టీస్ అధినేత ఈశ్వర్ ప్రకాష్ ప్రదానం చేశారు. ఈశ్వర్ ప్రకాష్‌ను కోటి ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీల చోరీ

తడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెండ్లూరుపాడు దళితవాడలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీలను దొంగలు చోరీ చేశారు. శనివారం రాత్రి యధావిధిగా ఆలయ పూజారి తలుపులు వేసి తాళాలు వేసి వెళ్లారు. ఆదివారం ఉదయం ఆలయానికి రాగా గుడి తాళాలు పగలగొట్టి హుండీలను ఎత్తుకెళ్లి ఉండడంతో గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - నరసారెడ్డికండ్రిగ జాతీయ రహదారి సమీపంలో ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీకాళహస్తి పట్టణం అగ్రహారానికి చెందిన కోటేశ్వరరావు కోట గ్రామానికి వెళ్లాడు. శనివారం అర్ధరాత్రి శ్రీకాళహస్తికి ఆటోలో వెళ్తుండగా మార్గమధ్యంలో నరసారెడ్డికండ్రిగ వద్ద కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కోటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా హరికృష్ణ



వెంకటగిరిటౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా టెలికం డిస్ట్రిక్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా వెంకటగిరికి చెందిన చిట్టేటి హరకృష్ణను నియమిస్తూ బీఎస్ఎన్ఎల్ జిల్లా ప్రిన్సిపల్ మేనేజర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

దక్షణామూర్తి విగ్రహ ప్రతిష్ట పూజలు



గూడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక త్యాగరాజవీధిలోని మీనాక్షిదేవి సమేత సోమేశ్వర ఆలయంలో ఆదివారం నూతనంగా దక్షణామూర్తి విగ్రహాన్ని ప్రతిష్టించారు. స్వామివారికి హోమ పూజలు, పూర్ణాహుతి పూజలు జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలను స్వీకరించారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండి శ్రీనివాసులురెడ్డి, ప్రజేంద్రరెడ్డి, హరినాధ్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చిల్లకూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం అధికంగా ఉండనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. ముఖ్యంగా తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సముద్రంలోని మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలను వెళ్లాలన్నారు.

గ్రేటర్‌పై వైసీపీ దుష్ప్రచారం

నరసింహయాదవ్, ఆర్‌సీ మునికృష్ణ



మీడియాతో మాట్లాడుతున్న నరసింహయాదవ్, ఆర్‌సీ మునికృష్ణ

తిరుపతి(ఎంఆర్‌పల్లె), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిని అభివృద్ధి పథంలో నడిపింది కూటమి ప్రభుత్వమేనని యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణలే అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో నరసింహయాదవ్ మాట్లాడుతూ ఇటీవల కౌన్సిల్ సమావేశంలో గ్రేటర్ తిరుపతికి అడ్డు చెబుతున్నట్లు వైసీపీ కార్పొరేటర్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు వ్యతిరేకించడం సరికాదన్నారు. గ్రేటర్ స్థాయి నగరంగా అభివృద్ధి చేయాలనుకుంటున్నామన్నారు. నలుగురు ఎమ్మెల్యేలతో చర్చించి గ్రేట్ తిరుపతికి సలహాలు తీసుకుంటున్నామని తెలిపారు. మాస్టర్‌ప్లాన్ రోడ్లు తాము చేపడితే వైసీపీ టీడీఆర్ బాండ్ల కుంభకోణంతో సంపాదించుకుందని ఎద్దేవా చేశారు. ఆర్‌సీ మునికృష్ణ మాట్లాడుతూ తిరుపతిలో అభివృద్ధి టీడీపీ పుణ్యమేనన్నారు.. గత వైసీపీ హయాంలో నగరం ఏమాత్రం అభివృద్ధి చెందలేదన్నారు. గ్రేటర్ తిరుపతి కూటమితోనే సాధ్యమని స్పష్టం చేశారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం నివేదించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



దగ్ధమైన పూరిల్లు

గూడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోటుపాళెం గ్రామంలో ఆదివారం షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైంది. అగ్నిమాపకశాఖ సిబ్బంది వివరాల మేరకు.. మండలంలోని పోటుపాళెం గ్రామంలో సుబ్బయ్యకు చెందిన పూరింట్లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో గృహోపకరణాలతో పాటు పలు వస్తువులు కాలిపోవడంతో రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు.

మెరుగైన పీఆర్సీ కోసం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కె.నాగప్రసాద్

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) ఇంజనీర్ల సమస్యలను ఐక్య మత్యంతో పోరాడి సాధించుకుందామని ఏపీఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శామ్యూల్, కె.నాగప్రసాద్, కె.వి.రామారావు, డి.నాగరాజు అన్నారు. తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో ఆదివారం అసోసియేషన్ రాష్ట్రకమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పీఆర్సీలో పెండింగ్ సమస్యలను దశలవారీగా పరిష్కరించుకున్నామన్నారు. రానున్న పీఆర్సీ మరింత మెరుగ్గా సాధించుకోవడానికి సంఘం కృషి చేస్తుందన్నారు. ఏఈల ఖాళీల భర్తీపై యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నామని చెప్పారు. నాగప్రసాద్‌తో పాటు సదరన్ డిస్కం నాయకులు పుల్లా బాలాజీ, వి.రమేష్, పి.రవికుమార్‌లు ప్రసంగించారు. అనంతరం రాష్ట్ర నాయకులను డిస్కం నాయకులు సత్కరించారు. సమావేశంలో నాయకులు కృష్ణప్రసాద్, లక్ష్మణ్ రావు, కె.జయప్రకాష్, మునిప్రసాద్, ఆంజనేయులు, రమేష్, సతీష్ వెంకటలక్ష్మి, స్వాతితో పాటు సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, సినీ హీరో సుధీర్‌బాబు, నటి సురేఖవాణి, ఆమె కుమార్తె, నటి సుప్రిత, నటుడు, దర్శకుడు బలగం వేణు ఉన్నారు. వీరికి అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.3.58 కోట్లు లభించింది.

శ్రీకాళహస్తి
సత్యవేడు

జనసేనలో కష్టపడే వారికి తగిన గుర్తింపు


సమావేశంలో నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న నాదెండ్ల మనోహర్

శ్రీకాళహస్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీలో నిస్వార్థంగా కష్టపడే వారందరికీ తగిన గుర్తింపు లభిస్తుందని ఆ పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ భరోసా ఇచ్చారు. పట్టణ శివార్లలోని ప్రైవేటు కల్యాణమండపంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడు తూ... జనసేనలో సామాన్య కార్యకర్తలకు సైతం అగ్ర పదవులు వరిస్తాయని చెప్పారు. శ్రీకాళహస్తిలో సామాన్య కార్యకర్తగా ఉన్న కొట్టేసాయిని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ గుర్తించి ఎంతో కీలకమైన శ్రీకాళహస్తీశ్వరాలయ ఛైర్మన్ పదవిని ఇవ్వడమేఉ ఇందుకు నిదర్శనమన్నారు. అధినేత ఆశయాల కోసం శక్తివంచన లేకుండా కృషి చేద్దామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కనీసం 15ఏళ్లపాటు అధికారంలో ఉంటేనే అభివృద్ధి చేయగలమన్నారు. అనంతరం పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, ముక్కంటి ఆలయ ఛైర్మన్ కొట్టే సాయి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్త జన సంద్రం... ముక్కంటి ఆలయం


క్యూలో వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. వారాంతపు సెలవులు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 94 మ ంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,574, రూ.50 ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,246మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,410 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 856, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 292, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 181, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 94మంది భక్తు లు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,246 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

శాస్త్రోక్తంగా ఆకాశదీపం




శ్రీకాళహస్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో ఆదివారం ఆకాశ దీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతి రోజు ఆకాశ దీపాన్ని వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా ఆలయ వేదపండితులు ఊంజల్ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలు చేసి స్తూపానికి జ్యోతిని అమర్చి ఎగురవేశారు. భక్తులు విశేషంగా దీపాన్ని దర్శించుకున్నారు.

ఆర్టీసీ బస్సులో వృద్ధురాలి నగలు, నగదు అపహరణ

నాగలాపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కూతురు ఇంటికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఆర్టీసీ బస్సులో నగలు, నగదు ను ఓ వృద్ధురాలు పోగొట్టుకుంది. బాధితురాలి వివరాల మేరకు... నాగలాపురం మండలం వెళ్లూరు గ్రామానికి చెందిన నీలమ్మ(62) శనివారం ఉదయం తమిళనాడులోని తిరువళ్లూరులో నివాసం ఉంటున్న తన కూతురు ఇంటికి వెళ్లింది. తిరిగి ఆదివారం ఉదయం తిరువళ్లూరు నుంచి బస్సులో నాగలాపురానికి బయలుదేరింది. తిరుగు ప్రయాణంలో ఊత్తుకోట నుంచి నాగలాపురానికి ఆర్టీసీ బస్సు ఎక్కి ఉచిత ప్రయాణం కోసం తన ఆధార్‌కార్డును పర్సు నుంచి కండక్టర్‌కి చూపించింది. కారణి వరకు బస్సులో కూర్చోడానికి వీలు లేకుండా నిలబడి ప్రయాణించింది. నాగలాపురం బస్టాండ్‌లో దిగిన తరువాత తన బ్యాగులో ఉన్న పర్సు కనబడడం లేదని గుర్తించింది. బస్సులో వెతికినా కనిపించలేదు. పర్సులో 3 సవర్ల బంగారం, రూ.5 వేలు నగదు ఉందని, పర్సు కనపడడం లేదని కంగారుతో వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామని నాగలాపురం పోలీసులు తెలిపారు.

పుత్తూరు వార్తలు

మామిడి రైతుల ఖాతాల్లో రూ.3.70 కోట్ల జమ

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులకు ప్రకటించిన సబ్సిడీ నగదును వారి ఖాతాల్లో జమ చేసింది. కిలో మామిడికి రూ.4 చొప్పున ఇచ్చిన మాట ప్రకారం పుత్తూరు, వడమాలపేట మండల పరిధిలోని రైతులకు రూ.3.70 కోట్ల నగదు జమ అయ్యింది. మామిడిని పల్ప్ ఫ్యాక్టరీకి తరలించే సమయంలో అక్కడ ఉద్యానవన శాఖ సిబ్బందికి అందించిన బ్యాంకు ఖాతాలలోనే పడుతుందని చాలా మంది రైతులు భావిస్తున్నారు. ఇలా సమస్యాత్మకంగా ఉన్న 37 మంది రైతుల సమస్య పరిష్కరించారు. అంతే కాకుండా 23 మంది రైతులకు సంబంధించి ఆధార్ లింక్ కలిగిన బ్యాంక్ వివరాలు ఇవ్వకపోవడం సమస్యగా మారింది. వీరి సమస్య కూడా పరిష్కరించారు. సబ్సిడీ నగదు తమ ఖాతాల్లో జమ కావడంతో రైతుల్లో సంతోషం వెల్లివెరిసింది. కాయలు తోలిన ప్రతి ఒక్కరికి నగదు జమ అవుతందని ఉద్యానవనశాఖ అధికారి సౌజన్య పేర్కొన్నారు. ఇంకా ఏదైన సమస్య కారణంగా నగదు జమ కానీ రైతులు ఈ నెల 30వ తేదీలోగా పుత్తూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని కార్యాలయంలో అందజేయాలని కోరారు. లియోస్ ఫ్యాక్టరీకి 4,120 కిలోల మామిడి కాయలు తోలానని తన ఖాతాలో రూ.16,480 జమ అయ్యిందని ఎస్ఆర్‌పురానికి చెందిన మేశం రామకృష్ణ చెప్పారు. తాను శ్రీవర్ష ఫ్యాక్టరీకి 9 టన్నుల మామిడి కాయలు తోలగా ప్రభుత్వం తన ఖాతాలో రూ.36,120 జమ చేసిందని వడమాలపేటకు చెందిన ప్రభాకర్ నాయుడు చెప్పారు. కూటమి ప్రభుత్వం రైతులకు బాసటగా నిలుస్తోందని, లేకపోతే తాము తీవ్రంగా నష్టపోయేవారమని రైతులు చెప్పారు.

వాకర్స్ అసోసియేషన్ విశ్వవాప్తం కావడం గర్వకారణం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రవిరాజు

పుత్తూరు,అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): దేశంలో పుట్టి విశ్వవ్యాప్తమైన ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ ఆరోగ్యకరమైన సమాజం కోసం పని చేస్తోందని ఎలెక్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ రవిరాజు అన్నారు. పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతి మెటర్నిటీ ఆస్పత్రిలో మ హిళలకు వివిధ విభాగాల కింద వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. పుత్తూరు అసోసియేషన్ కోరితే కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని మెటర్నిటీ వైద్యాధికారి ఆర్.ఆర్. రెడ్డి తెలిపారు. మితాహారం వల్ల కలిగే లాభాలను అన్నా గౌరీ మెడికల్ కళాశాల మెడికల్ సూప రింటెండెంట్ డాక్టర్ రవి వివరించారు. ఈ సమావేశంలో డాక్టర్లు శ్రీనివాసులురెడ్డి, శ్రీధర్ రాజు, అసోసియేషన్ నాయకులు కెఎల్ఎన్ మూర్తి, రఫి, మునికృష్ణయ్య, గుణశేఖర్‌రెడ్డి, కుప్పయ్యశెట్టి, ద్వారకనాథశెట్టి పాల్గొన్నారు.

కాలువల్లో ముందుకు సాగని మురుగు

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వరుస వర్షాల కారణంగా కాలువల్లో పారాల్సిన మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. కాలువల్లో చెత్తాచెదారం అడ్డుపడుతుండటంతో మురుగు ముందుకు సాగడం లేదు. వర్షాల కారణంగా మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది కూడా కాలువల్లో చెత్తను తొలగించడంలేదు. రైల్వే కాలనీ, గేట్ పుత్తూరు, ఎన్జీవో కాలనీల్లో ఇళ్లలోకి మురుగు వెళ్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు ఆదివారం అత్యవసరంగా పారిశుధ్య సిబ్బందిని పంపి కాలువల్లో అడ్డుపడిన వ్యర్థాలను తొలగించారు.

కలంలకారీ కళాకారిణి మునిరత్నమ్మకు ఎమ్మెల్యే నివాళి

శ్రీకాళహస్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కలంకారీ కళాకారిణి, జాతీయ అవార్డు గ్రహీత ఎం.మునిరత్నమ్మ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్ ఆమె గృహానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పాలకమండలి వ్యవహార శైలిపై విమర్శల వెల్లువ!





వాహన మండపానికి అతికించిన స్టిక్కర్- వాహనమండపం, భిక్షాల గాలిగోపురం, సాంస్కృతిక వేదిక వద్ద ఫ్లెక్సీలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయ ధర్మకర్తలమండలిలో కొందరు వ్యవహరించిన తీరుపై ఆదివారం విమర్శలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా రాజకీయ ఫ్లెక్సీలు ఇష్టారాజ్యంగా పవిత్ర ప్రదేశాల్లో ఏర్పాటు చేయడంపై భక్తులు విస్మయం వ్యక్తం చేశారు. 2014లో అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి పట్టణంలోని చతుర్మాడ వీధుల్లో రాజకీయ ఫ్లెక్సీలను నిషేధించారు. అప్పటి నుంచి అది అమలులో ఉంది. ఆ తరువాత గత వైసీపీ ప్రభుత్వం ఆ నిబంధనను గాలికి వదిలేసింది. మాడవీధుల్లో రాజకీయ ఫ్లెక్సీలకు బాటవేసింది. అయితే ఏడాదిన్నర క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ రాజకీయ ఫ్లెక్సీలపై ఆంక్షలు అమలు చేశారు. దీంతో స్థానిక భక్తులు హర్షం వ్యక్తం చేశారు. అయితే ఆదివారం ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం కోసం కూటమి నాయకులు ఫ్లెక్సీల ఆంక్షలకు తిలోదకాలు పలికారు. అంతకుమించి... అన్న చందంగా మాడవీధులతో పాటు ఏకంగా ఆలయ ప్రాంగణంలోని పవిత్ర ప్రదేశాల్లో రాజకీయ ఫ్లెక్సీలు పెట్టడంపై భక్తులు దుమ్మెత్తి పోశారు. మాడవీధుల్లో ఫ్లెక్సీలు పెట్టడంతో పాటు భిక్షాల గాలిగోపురం, రాజగోపురం, సన్నిధివీధిలో కూడా ఏర్పాటు చేశారు. అంతే కాకుండా అత్యుత్సాహంగా ఆలయ సాంస్కృతిక కళా వేదికకు ఫ్లెక్సీలు పెట్టారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తుల ఊరేగింపు సందర్భంగా వాహన మండపంలో కొలువు దీరుతారు. అక్కడ ధూప, దీప, నైవేద్యం, హారతులు సమర్పించి వాహనాలను అధిరోహించిన తరువాత పట్టణంలో ఊరేగుతారు. అంతటి పవిత్ర మండపానికి ఫ్లెక్సీలు, స్టిక్కర్లు అంటించారు. ఇప్పటి వరకు గతంలో రాజకీయ ఫ్లెక్సీలు ఇంత తీవ్రస్థాయిలో ఎవరూ ఏర్పాటు చేయలేదు. ఇక ప్రమాణ స్వీకారం కోసం పట్టణవ్యాప్తంగా కొందరు రద్దీ వేళలో ర్యాలీ నిర్వహించడం వాహనదారులకు ట్రాఫిక్ సమస్యతో అసౌకర్యం ఏర్పడింది.

చెరువు కట్టలను పటిష్ఠ పరచండి: కలెక్టర్


జంగాలపల్లి చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

ఏర్పేడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): చెరువు కట్టలను పటిష్ఠ పరచాలని నీటి పారుదల శాఖ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఏర్పేడు మండలంలోని జంగాలపల్లి, పల్లం చెరువులను ఆదివారం ఆయన ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా జంగాలపల్లి చెరువును పరిశీలించిన సమయంలో గతంలో జంగాలపల్లి చెరవుకు బొగడ పడి రివిట్‌మెంట్ నిర్మాణం జరిగిందని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. వెంటనే చెరువుకు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని పేర్కొన్నారు. అనంతరం అక్కడి నుంచి వెంకటగిరికి వెళ్లే మార్గంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పల్లం చెరువును పరిశీలించారు. ఇప్పటికే 75శాతం చెరువు నిండిందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ రాధాకృష్ణ, ఈఈ శివారెడ్డి, డీఈ ఆదినారాయణనాయుడు, జేఈ జయకుమార్, తహసీల్దారు భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు, టీడీపీ నాయకులు ఎస్.పొన్నారావు, బాలాజీరావు, గురువులు, చంద్రశేఖర్‌నాయుడు, రాజకుమార్‌నాయుడు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్‌నాయుడు తదితరులున్నారు.

తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొందాం

సత్యవేడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రానున్న మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు అండగా నిలబడదామని తహసీల్దార్ రాజశేఖర్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మొంథా తుఫాన్‌పై తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై పలు సూచనలు చేశారు. రానున్న నాలుగు రోజులు కీలకమని, మండలంలోని ముంపు ప్రాంతాలను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. గర్భిణులను సమీప ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు తరలించాలన్నారు. ఆస్పత్రులలో విద్యుత్ అంతరాయం కలగకుండా జనరేటర్లను సిద్ధం చేసుకోవాలన్నారు. తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, క్లోరినేషన్ చేయాలని, పారిశుధ్య చర్యల కోసం సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది వారి ప్రాంతాల్లో అందుబాటులో ఉండేలా ట్రాన్స్‌కో అధికారులు ఆదేశాలు జారీ చేయాలన్నారు. పాడి, పంట నష్టంపై ఎప్పటికప్పుడు అంచనావేసి నివేదికలను ఉన్నతాధికారులకు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఓ త్రివిక్రమరావు, ఎంఈవో ఉష, ఏవో మురళి, పంచాయతీరాజ్ ఏఈ ఇబ్రహీం ఖాన్, ఈవోపీఆర్‌డీ మునిరవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేల సరుకులు తీసుకుని డబ్బులివ్వకుండా జంప్!


నిందితుడి చిత్రం

నాగలాపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సరకులు తీసుకుని డబ్బులివ్వకుండా గుర్తు తెలియని వ్యక్తి పారిపోయాడు. పట్టణంలోని వీకేఎం వీధిలో నీలకంఠం ఎంటర్‌ప్రైజస్ దుకాణంలో ఆదివారం ఓ గుర్తు తెలియని వ్యక్తి రూ.50 వేలకు కరెంటు సామగ్రి కొన్నాడు. షాపు యజమాని బిల్లు వేసిన తరువాత వినియోగదారుడు ఫోన్‌పే, గూగుల్‌పే చేయలేదని నమ్మబలికాడు. షాపులో పని చేసే వ్యక్తిని తనతో పంపించాలని కోరాడు. సరుకుతో పాటూ యువకుడిని తన ద్విచక్రవాహనంలో కూర్చోబెట్టుకుని బయటకొడియంబేడు ఐఓసీ బంకు వరకు తీసుకెళ్లాడు. అక్కడ యువకుడిని దింపి 5 నిమిషాల్లో తమ ఓనరు వద్ద డబ్బులు తీసుకొస్తానని చెప్పి సరుకుతో పారిపోయాడు. చేసేది లేక యువకుడు షాపుకు చేరుకుని జరిగింది. యజమానికి చెప్పాడు. షాపులోని సీసీ పుటేజీ ఆధారంగా షాపు యజమాని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ సునీల్ చెప్పారు.

చలో హైదరాబాద్ కరపత్రాల ఆవిష్కరణ



శ్రీకాళహస్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జైహో 3వ జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని పలువురు కోరారు. ఆదివారం పట్టణలోని గాంధీ విగ్రహం వద్ద చలో హైదరబాద్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నవంబరు 8,9 తేదీల్లో జైహో 3వ జాతీయ సమ్మేళనం హైదరాబాద్ నగరంలోని ఎల్బీనగర్‌లో జరుగుతుందన్నారు. చరిత్ర నిర్మాణంలో ప్రజలు భాగస్వాములై ఐక్యతను చాటి చెప్పాలన్నారు. మతోన్మాదులను దేశం నుంచి తరిమివేద్దామన్నారు. బాబా ఫరీద్, గుమ్మల్ల రాజేశ్వరరావు, ఓరుగంటి నాగేశ్వరరావు, గరికపాటి రమేష్‌బాబు, శ్యామ్‌సుందర్, కుమార్, రజని పాల్గొన్నారు.

తొట్టంబేడు తహసీల్దార్ కార్యాలయం పరిశీలన


తహసీల్దార్‌కు సూచనలు చేస్తున్న కలెక్టర్


శ్రీకాళహస్తి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయాన్ని ఆదివారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. తహసీల్దారు భవనం శిథిలావస్థకు చేరుకుని ఉరుస్తున్న నేపథ్యంలో అధికారులతో కలిసి తనిఖీ చేశారు. సమీపంలోని సమగ్ర శిశు పథక కార్యాలయ భవనంలోకి తహసీల్దారు కార్యాలయాన్ని తాత్కాలికంగా మార్పు చేసి కార్యకలాపాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ, తహసీల్దారు భారతి పాల్గొన్నారు.

జీఎన్‌కండ్రిగలో పునరావాస కేంద్రం ఏర్పాటు


పునరావాస కేంద్రం వద్ద అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తూఫాన్ నేపథ్యంలో జీఎన్‌కండ్రిగలోని పాఠశాలను పునరావాస కేంద్రంగా మార్చారు. తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో వెంకటరత్నమ్మ ఆదివారం కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... మండలంలోని కాళంగి ఏరు ఉధృతంగా ప్రవహిస్తే తహానగర్, చిన్నాయగుంట, జంబుగోళం, పూసలపల్లి జలమయమయ్యే అవకాశం ఉందన్నారు. దీంతో ఆ గ్రామాల వారికి జీఎన్‌కండ్రిగ పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ భోజన సదుపాయం కల్పించినట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు ఆయా గ్రామాల్లోనే ఉండాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. వర్షాలతో చెరువులు నిండాయని ప్రస్తుతం తుఫాన్ నేపథ్యంలో కట్టలు తెగే ప్రమాదం ఉందన్నారు. పశువులు, గొర్రెలను బయటకు పంపవద్దని పాడి రైతులకు సూచించారు.

మల్లిమడుగు డ్యాం వద్ద సందడి

రేణిగుంట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మల్లిమడుగు డ్యాం వద్ద ఆదివారం సందర్శకుల సందడి నెలకొంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు డ్యాం నిండటంతో గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఆదివారం సెలవుదినం కావడంతో కోడూరు, రాజంపేట, తిరుపతి, రేణిగుంట పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో డ్యాం పరిసరాలు నిండిపోయాయి. యువత, మహిళలు కుటుంబసభ్యులతో సహపంక్తి భోజనాలు చేశారు. చేపలు పడుతూ కేరింతలతో సందడి చేశారు.

ముక్కంటి సేవలో సినీనటి సురేఖావాణి



శ్రీకాళహస్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని ఆదివారం సినీనటి సురేఖావాణి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆమెను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశరు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పూడి గ్రామాలకు తాత్కాలిక మార్గం ఏర్పాటు



కేవీబీపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో పూడి గ్రామాల పరిధిలో ప్రవహిసెంతరంర కాళంగి ఏరుపై మట్టి వంతెనకు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. అయితే వర్షాలు కురిస్తే ఈ వంతెన కూడా కొట్టుకుపోతుందని గ్రామస్తులు చెబుతున్నారు. శాశ్వత వంతెన ఏర్పాటు చేసి తమ సమస్య తీర్చాలని పూడి, దిగువపూడి, ఎగువపూడి, పూడి సీకేపురం, పోలినాయుడు కండ్రిగవాసులు కోరుతున్నారు.

సరుకుల పంపిణీ

ఏర్పేడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగంపల్లి వద్ద ఉన్న డేవిడ్ అండ్ లూయిస్ రీస్ ఆస్పత్రిలో ప్రత్యేకమైన పిల్లలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చెన్నైకు చెందిన లవ్ ఇన్ యాక్షన్ ట్రస్టు నిర్వాహకులు 2 నుంచి 18 సంవత్సరాల వయసు గల వారికి 20 రకాలకు పైగా కిలో చొప్పున పప్పు దినుసులు, పండ్లు, కోడిగుడ్లు అందించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకులు విమలా రీస్, ఎంరీస్ రీస్ దంపతులు, ఏఆర్‌టీ సెంటర్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ ఆనందరావు, దాతలు రమేష్, సుధాకర్, ప్రాజెక్టు కోఆర్డినేటర్ రామచంద్రయ్య పాల్గొన్నారు.

కూలిన పూరిగుడిసె ఆదుకోవాలని వృద్ధురాలి మొర



శ్రీకాళహస్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేలవేడు దళితవాడకు చెందిన వృద్ధురాలు సుమతి పూరిగుడిసె ఇటీవల కురిసిన వర్షానికి శనివారం కూలిపోయింది. దీంతో తల దాచుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతోంది. పూరిగుడిసె పక్కనే ఉన్న బాత్‌రూంలో ప్రస్తుతానికి తల దాచుకుంటోంది. అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరుతోంది.